# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్





ప్లాస్టిక్ వ్యర్థాలను మేతగా తింటున్న పశువులు..

- కొంపల్లి సర్కిల్ ‘సిఎంసి’ పరిధిలోని సుభాష్ నగర్‌లో ప్లాస్టిక్ కవర్‌లో చెత్త..
- పాలిచ్చే పశువులు ప్లాస్టిక్ తింటున్నది చూసి ‘కలత’ చెందిన పర్యావరణ వేత్త..
- ప్రమాదకర ప్లాస్టిక్ నియంత్రణ అంశం..! అవగాహన కార్యక్రమాలకే పరిమితమా..?
- అధికారుల పర్యవేక్షణ లేదు..!ప్లాస్టిక్ కవర్‌ల నియంత్రణపై ప్రజలకు పట్టింపు లేదు..!
- ప్రమాదకర ప్లాస్టిక్ కవర్‌ల వాడకంలో..! వారాంతపు సంతలు..! వీధి వ్యాపారులు..!
- క్యాన్సర్ కారక మహమ్మారి ప్లాస్టిక్‌పై జీహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం..
- ప్లాస్టిక్ కవర్‌ల నియంత్రణలో అధికార యంత్రాంగం విఫలం..
- ఆందోళనకు గురిచేస్తున్న ప్లాస్టిక్ వాడకంపై పర్యావరణ ప్రేమికులు అసహనం..

# ప్లాస్టిక్ నియంత్రణపై..!

# పర్యవేక్షణ ఏది..?



- ఎక్కడపడితే అక్కడ..! ప్లాస్టిక్ కవర్‌ల వినియోగం..
- వారాంతపు సంతలు..! వీధివ్యాపారుల వద్ద అత్యధికంగా వాడకం..!
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం..! పర్యవేక్షణ శూన్యం..!



వారాంతపు సంతలో ప్లాస్టిక్ సంచులు వినియోగం అధికం..



ప్లాస్టిక్‌ను రూపుమాపడమంటే అంత తేలికైన విషయం కాదని, ఈ ప్లాస్టిక్ వ్యార్థను కాల్చిన పొగను పీల్చినా క్యాన్సర్ కారక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది.. పశువులు, మేకలు, మేతగా తిన్నా వాటి ప్రాణాలకే ప్రమాదం, జీర్ణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని మరణించిన మూగజీవాల సంగతి తెలిసిందే.. అవగాహన లేని వారు రోడ్లపై చెత్త వేయడం నేరంగా పరిగణిస్తూ, చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.. ప్లాస్టిక్ వ్యర్థాలు తింటే, మూగ జీవాలకు, కాలిస్తే ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.. ఈ ప్లాస్టిక్ తయారీ కంపెనీలలో తయారీని నిషేధించే దిశగా జీహెచ్ఎంసి అధికారులు చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికుడు రవిందర్ ముదిరాజ్ అన్నారు

ఆకలిని తట్టుకోలేని మూగజీవులు, ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న పశువులు, మేకలు మృతిచెందిన ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రభుత్వాలు, పర్యావరణ ప్రేమికులు, చొరవ చూపి, ఎన్నో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్య పరిచినా.. ప్రయోజనం శూన్యం.. ఈ ప్రమాదకర ప్లాస్టిక్‌ను జీహెచ్ఎంసి అధికారులు కూడా కొంత నిర్లక్ష్యమే వహిస్తున్నారని స్పష్టమవుతుంది.. మరోవైపు అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేమితో, ఈ మహమ్మారిని శాశ్వతంగా నియంత్రించలేక పోతున్నారని పలువురు పర్యావరణ ప్రేమికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.. ముఖ్యంగా ఈ వారాంతపు సంతలు, వీధి వ్యాపారులు.. ఈ చిరు వ్యాపారులు అందరూ, అధిక ధరలు చెల్లించలేక, నాణ్యత లేని, నాసిరకం ప్లాస్టిక్ కవర్‌లు కొనుగోలు చేసి కూరగాయలు, ఇతరత్రా వస్తువులు కొనుగోలు చేసినవారికి ఇస్తున్నారు.. దీంతో వస్తువులు, కాయకూరలు వాడిన తర్వాత చెత్తను కవర్‌లలో పెట్టి, రోడ్లపై పడేసే కొందరు అజ్ఞానుల తీరు సమాజాన్ని ప్రమాదంలో పెడుతుంది..

## పశువులకు ఆహారంగా ప్లాస్టిక్ వ్యర్థాలు: రవిందర్ ముదిరాజ్..

కొంపల్లి సర్కిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సుభాష్ నగర్ చివరి బస్ స్టాండ్ వద్ద, స్థానికులు వేస్తున్న చెత్త కవర్లు, బర్రెలకు ఆహారంగా మారుతున్నాయి.. సామాజిక వేత్త పర్యావరణ ప్రేమికుడు, నిత్యం ప్లాస్టిక్ నియంత్రణకు అలుపెరుగని పోరాటం చేస్తున్న కోలా రవిందర్ ముదిరాజ్ శనివారం అటుగా వెళ్తున్న సమయంలో, తన మనసుకు తీవ్రమైన బాధను కలిగించే దృశ్యం ఆయన గుండెను పిండేసిందని ఆవేదన చెందారు.. స్థానికులు చెత్తను పడేసిన చోట ఓ పది బర్రెలు ప్లాస్టిక్ కవర్‌లు తినడాన్ని ఫోన్‌లో చిత్రీకరించారు.. కొంపల్లి సర్కిల్ సిఎంసి అధికారుల నిర్లక్ష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలు పశువులకి మేతగా మారాయని రవిందర్ ముదిరాజ్ తెలిపారు.. ఆ ప్లాస్టిక్ తిన్న పశువులకూ ప్రమాదమే.. తద్వారా పశువుల పాలు త్రాగిన ప్రజలు రోగాల బారిన పడతారని రవిందర్ తెలిపారు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నేరెళ్ల ఇసుక మాఫియా గుర్తుందా కేటీఆర్..

## దళిత యువకులను చిత్రహింసలు పెట్టింది మర్చిపోయావా



**హైదరాబాద్ పెన్ పవర్:**అసెంబ్లీలో మైనింగ్ అంశాలపై జరిగిన చర్చలో మాజీ మంత్రి హరీశ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు మంత్రి వాకిటి శ్రీహరి. ఓ మంత్రికి సంబంధించిన కంపెనీ పేరును ప్రస్తావిస్తూ.. సభలో ఆరోపణలు ఎలా చేస్తారంటూ హరీశ్ ను ప్రశ్నించారు మంత్రి వాకిటి. పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ పాలనలో.. ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా ఎలా జరిగిందో.. ఏ స్థాయిలో అరాచకాలు జరిగాయో తెలంగాణ రాష్ట్రం అంతా చూసిందన్నారు మంత్రి వాకిటి. బీఆర్ఎస్ హయాంలో.. మాజీ మంత్రి కేటీఆర్ నియోజకవర్గం అయిన నేరెళ్ల గ్రామంలో జరిగిన ఇసుమా మాఫియాను గుర్తు చేశారు మంత్రి వాకిటి. రోజుకు వెయ్యి లారీలతో ఇసుక మాఫియా రాజ్యం ఏలిందని.. ఇసుక లారీ కింద పడి ఓ చిన్నారి చనిపోతే.. ప్రశ్నించిన నేరెళ్ల దళిత యువకులను పోలీసులతో చిత్ర హింసలు పెట్టారని గుర్తు చేశారు మంత్రి వాకిటి. పోలీస్ నిర్బంధంలో ఉన్న నేరళ దళిత యులకులను అప్పట్లో పరామర్శించటానికి నేను, భట్టి, పొన్నం వెళితే.. దెబ్బలకు తట్టుకోలేకుండా ఉన్నాం అన్నా.. ఇంత విషం ఇచ్చి వెళ్లవే అంటూ ఆ దళిత యువకులు కన్నీళ్లతో చెప్పుకున్న బాధలు గుర్తు లేదా కేటీఆర్ అంటూ.. అసెంబ్లీలోని నిండు సభలో బీఆర్ఎస్ పార్టీని ప్రశ్నించారు మంత్రి వాకిటి. కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ మైనింగ్ పై విచారణ జరిపించాలని.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన మైనింగ్ విధ్వంసంపైనా విచారణ చేద్దామంటూ బీఆర్ఎస్ పార్టీని సవాల్ చేశారు మంత్రి వాకాటి.

# మేం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం.. మీరు వ్యాట్ తగ్గించండి

## పెట్రో ధరలపై రాష్ట్రాలకు కిషన్‌రెడ్డి హితవు

## దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో 35.20% ఉందని వెల్లడి




**హైదరాబాద్ పెన్ పవర్:** ‘ఇజ్రాయెల్, అమెరికా- ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలను పరిగణనలోకి తీసుకుని పెట్రోలు, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని తగ్గించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలపై భారం పడకుండా రాష్ట్రాలు కూడా వ్యాట్‌ను తగ్గించుకోవాలి’ అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. పెట్రోలు, డీజిల్, ఎల్పీజీ నిల్వలపై తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించేందుకు హైదరాబాద్‌లోని సీజీఐ టవర్స్‌లో కిషన్‌రెడ్డి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. “దేశంలోనే

-4 లో

# మేం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం.. మీరు వ్యాట్ తగ్గించండి

- 3 పేజీ తరువాయి

అత్యధికంగా తెలంగాణ రాష్ట్రం పెట్రోలు, డీజిల్‌పై పన్నెండేళ్ల నుంచి 35.20 శాతం వ్యాట్ విధిస్తోంది. గతంలో పాలించిన కేసీఆర్.. ప్రజాపాలన అంటూ డప్పు కొట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఒక్క పైసా కూడా వ్యాట్‌ను తగ్గించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 31 శాతం, మహారాష్ట్రలో 26 శాతం, కర్ణాటకలో 29 శాతం వ్యాట్ ఉండగా.. తెలంగాణలో మాత్రం ఎందుకు 35.20 శాతం విధిస్తున్నారు? తగ్గించండి. రాష్ట్రంలో పుష్కలంగా పెట్రోలు, డీజిల్, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయి. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చమురు సంస్థలు పెట్రో, గ్యాస్ ఏజెన్సీలకు మూడురోజుల పాటు క్రెడిట్ సౌకర్యాన్ని ఇస్తున్నాయి.

**లాక్‌డౌన్ వదంతులను నమ్మొద్దు**

దేశంలో మళ్లీ లాక్‌డౌన్ విధించనున్నారన్న వదంతులను నమ్మొద్దు. ప్రధానమంత్రి మోదీ లోక్‌సభలో మాట్లాడిన మాటల్లో సారాంశాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండా లాక్‌డౌన్ విధిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వేల సంఖ్యలో పోస్టులు అప్‌లోడ్ చేశారు. మనదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్‌ను సకాలంలో తెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్‌లను పొదుపుగా వినియోగించాలి.

**వదంతులు వ్యాప్తి చేస్తే అరెస్టు చేయాలని సీఎం రేవంత్‌ను కోరాం**

సామాజిక మాధ్యమాల్లో వీడియోలు, వార్తల కారణంగానే వాహనాలు ఉన్నవారు పెట్రోలు బంకులకు వరుస కట్టారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో వంటిళ్లలో చిచ్చురగిలేలా చేశారు. అందుకే సామాజిక మాధ్యమాల్లో వదంతులను సృష్టించేవారిని అరెస్టు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభ్యర్థించాం" అని కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఈడీ పీయూష్ మిత్తల్, బీపీసీఎల్ సీజీఎం (రిటైల్) నితీష్ సెలుకర్, హెచ్‌పీసీఎల్ సీజీఎం (రిటైల్) సుశీల్‌కుమార్ రాయ్, తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేంద్రరెడ్డి, రాష్ట్ర ఎల్పీజీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ తో కలిసొచ్చేది ఎవరు



**హైదరాబాద్, మార్చి 28, పెన్ పవర్:**
నియోజకవర్గాల డీలిమిటేషన్ అనే లీక్ రాగానే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమం ప్రకటించేశారు. దక్షిణాదికి అన్యాయం అని పోరాటానికి అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. 2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు శిక్షకు గురవుతాయని ఆయన వాదిస్తున్నారు. యాభై శాతం సీట్లను పెంచినా ఉత్తరాది రాష్ట్రాలైన యూపీ, బీహార్ వంటి చోట్ల సీట్లు భారీగా పెరిగి, దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గిపోతే.. రేపటి రోజున ఢిల్లీలో ఎవరు పీఠం ఎక్కాలో నిర్ణయించే శక్తి దక్షిణ భారతం కోల్పోతుందనేది ఆయన ప్రధాన ఆందోళన. దీనిని ఆయన దక్షిణాదిపై ప్రయోగించబోయే ఆఖరి బుల్లెట్ గా అభివర్ణిస్తున్నారు.రేవంత్ రెడ్డి వినిపిస్తున్న దక్షిణాదికి అన్యాయం అనే వాదనకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ నుండి బలమైన మద్దతు లభించే అవకాశం ఉంది. ద్రావిడ సిద్ధాంతం, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిపై స్టాలిన్ ఇప్పటికే కేంద్రంతో పోరాడుతున్నారు. అయితే ఆయన మళ్లీ అధికారంలోకి వస్తేనే వినిపిస్తారు. ఓడిపోతే.. బీజేపీ భయంతో ఆయన సైలెంట్ గా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. టీడీపీ ఎన్డీఏ కూటమిలో ఉంది. వైసీపీలు బీజేపీకి ఎప్పుడూ సలాం కొడుతూనే ఉంది. జగన్ మోహన్ రెడ్డి కేంద్రంతో ఘర్షణ పడే వైఖరిని ప్రదర్శించకపోవడంతో, ఏపీ నుండి రేవంత్ ఆశించిన మద్దతు లభించకపోవచ్చు. కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం ఈ విషయంలో రేవంత్‌తో కలిసి నడిచే అవకాశం ఉన్నా ఎన్నికల ఫలితాలే ఎంత బలంగా ఈ మద్దతు లభిస్తుందా అన్నది తేలాల్సి ఉంది.రాజకీయ నాయకుల వాదనలు ఎలా ఉన్నా, ప్రజలు దీనిని ఎలా స్వీకరిస్తారనేదే అసలు ప్రశ్న. అభివృద్ధిలో ముందున్న దక్షిణాది రాష్ట్రాల పన్నుల ఆదాయం ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువగా మళ్ళుతోందనే భావన ఇప్పటికే దక్షిణాది ప్రజల్లో ఉంది. ఇప్పుడు రాజకీయ ప్రాతినిధ్యం కూడా తగ్గిపోతుందనే ప్రచారం గట్టిగా సాగితే, ఇది సెంటిమెంట్‌గా మారే అవకాశం ఉంది. ప్రజలు దీనిని తమ ఆత్మగౌరవ సమస్యగా భావిస్తే రేవంత్ రెడ్డి హీరో అవుతారు.జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉంటూ దక్షిణాది-ఉత్తరాది అనే విభజన రేఖను రేవంత్ గీయడం పార్టీ అధిష్టానానికి సంకట స్థితిని కలిగిస్తోంది. ఉత్తరాదిలో తిరిగి పుంజుకోవాలని చూస్తున్న కాంగ్రెస్, రేవంత్ వ్యాఖ్యలను బహిరంగంగా సమర్థిస్తే అక్కడ నష్టం జరుగుతుందనే భయం ఉండవచ్చు. అందుకే ఇంకా.. డీలిమిటేషన్ అంశంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో అధికారికంగా స్పందించలేదు. కేంద్రం ఈ బిల్లుపై పూర్తి స్థాయిలో కసరత్తు ప్రారంభించిన తర్వాతే అసలు రాజకీయం ప్రారంభమవుతుంది

# కవితతో వచ్చేదెవరు...

**నిజామాబాద్, మార్చి 28, పెన్ పవర్:**
తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కూతురు, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ, ఢిల్లీ లిక్కర్ కేసులో ఆరు నెలలు జైలుకు వెళ్లొచ్చిన జాగృతి అధ్యక్షురాలు.. కల్వకుంట్ల కవితను ఆరు నెలల క్రితం బీఆర్ఎస్ బహిష్కరించింది. పార్టీ నేతలపై అవినీతి ఆరోపణలు చేయడం, అంతర్గత కుమ్ములాటల కారణంగా కవితను అధిష్టానం సస్పెండ్ చేసింది. దీంతో పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. త్వరలో కొత్త పార్టీ పెడతానని ప్రకటించారు. ఈ క్రమంలో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి ముహూర్తం ఖరారైంది. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభలో తన కొత్త రాజకీయ పార్టీని ప్రకటిస్తానని కవిత తెలిపారు.శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఈ కీలక ప్రకటన చేయడం సంతోషంగా ఉందని కవిత నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వెల్లడించారు. ఈ శుభదినాన్ని ఎంచుకోవడం వల్ల పార్టీకి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఆశీస్సులు లభిస్తాయని ఆమె భావిస్తున్నారు. బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ కూడా ఏప్రిల్ 22న ఆవిర్భవించింది. అందుకే కవిత కూడా ఏప్రిల్ 20 తర్వాతనే ముహూర్తం పెట్టుకున్నారు.రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలపై పోరాటం, సర్వోదయ తెలంగాణ సాధనే ఈ కొత్త పార్టీ ముఖ్య ఉద్దేశమని కవిత స్పష్టం చేశారు. గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాలను అధ్యయనం చేసి, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగం, రైతు సమస్యలు, మహిళా భద్రత వంటి అంశాలపై ఉద్యమిస్తుందన్నారు. అందరి అభివృద్ధి, సమాన అవకాశాలు కల్పించే పాలన లక్ష్యమని తెలిపారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరినీ కలుపుకుని ప్రయాణం చేస్తామన్నారు.ఏప్రిల్ 25 శుక్రవారం ఉదయం 10 గంటలకు మేడ్చల్ జిల్లా, మునీరాబాద్‌లో జాగృతి సభ ఉంటుంది. ఈ సభకు సుమారు లక్ష మందిని సమీకరించాలని కవిత లక్ష్యంగా పెట్టుకున్నారు అన్ని వర్గాల ప్రజలు, యువకులు, రైతులు, మహిళలు



భారీ సంఖ్యలో తరలిరావాలని కవిత విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తన అనుచరులకు కూడా దిశానిర్దేశం చేశారు. ఈ వేదికపై పార్టీ పేరు, జెండా, ఎజెండా ప్రకటిస్తారు. పార్టీ కమిటీని కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉందకవిత కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో మూడు ముఖ్య పార్టీల (బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ) మధ్య సరికొత్త సమీకరణాలు ఏర్పడనున్నాయి. ఇక మునీరాబాద్ సభా వేదికగా ఎంచుకోవడం వెనుక జీహెచ్ఎంసీ ఎన్నికల వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఆకర్షించే ఉద్దేశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత గతంలో ప్రకటించినట్లు పార్టీ పేరులో "తెలంగాణ" ఉంటుందని తెలుస్తోంది. కవిత వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట లేదా బోధన్ నుంచి పోటీ చేసే అవకాశం ఉందని సమాచారం.కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో సమీకరణలు మారనున్నాయి. సర్వోదయ భావజాలంతో, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ రాష్ట్ర భవిష్యత్తును మలచడమే ఈ పార్టీ లక్ష్యం. ఏప్రిల్ 25న మునీరాబాద్ సభతో తెలంగాణ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం మొదలవనుంది.

# 31నే గణపతి లొంగుబాటు

**వరంగల్, మార్చి 28, పెన్ పవర్:**
మావోయిస్టు అగ్రనేత గణపతి త్వరలో లొంగిపోనున్నట్లు గత కొంత కాలంగా ప్రచారం జరుగుతుంది. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ నేపాల్ లో ఉన్నారని నిఘా వర్గాల నుంచి సమాచారం. అయితే ఇటీవల కాలంలో ఆపరేషన్ కగార్ ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన తర్వాత వందల సంఖ్యలో మావోయిస్టు నేతలు హతమయ్యారు. అనేక మంది అగ్ర నేతలు, తమ అనుచరులు, ఆయుధాలతో సహా లొంగిపోయారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులకు లొంగుబాటు కోసం విధించిన గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. అంటే ఇంకా నాలుగు రోజులు మాత్రమే సమయం ఉంది.అయితే ఇప్పటి వరకూ లొంగిపోయిన అగ్రనేతలు చాలా వరకూ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారికి పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. అయితే మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత రామన్న అలియాస్ గణపతి అలియాస్ లక్ష్మణరావు ఈ నెల 31వ తేదీన లొంగిపోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు తెలంగాణ పోలీసులకు ముందుగానే గణపతి ససమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఆయనపై కోట్ల రూపాయల రివార్డు ఉంది. పలు కీలక కేసుల్లో నిందితుడిగా ఉన్న గణపతి లొంగితే మావోయిస్టు పార్టీ దాదాపుగా తుడిచిపెట్టుకు పోయినట్లేనని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువు ఈ నెలాఖరుతో ముగియనుండటంతో గణపతి నేరుగా నేపాల్ నుంచి హైదరాబాద్ కు చేరుకుని తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇప్పటికీ ఒడిశా, ఛత్తీస్ గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఆపరేషన్ నిర్వహిస్తుంది. సాయుధ బలగాలు జల్లెడ పడుతూనే ఉన్నాయి. ఈ నాలుగు రోజుల్లో ఎన్ కౌంటర్లతో పాటు లొంగుబాట్లు కూడా ఉంటాయని చెబుతున్నారు. మిసిర్ బిస్రా అలియాస్ భాస్కర్ ఝార్ఖండ్ లో ఉన్నారని గుర్తించిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వ వరా ల నుంచి అందుతున్న సమాచారమ మేరకు గణపతి లొంగిపోయేందుకు తన అంగీకారాన్ని తెలిపినట్లు చెబుతున్నారు.

## రంగారెడ్డి జిల్లాలో రెచ్చిపోయిన దోపిడి దొంగలు

**పరిగి, మార్చి 28 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని అమ్లాపూర్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున దొంగలు ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడ్డారు. యజమాని శ్రీనివాస్ గోవాకు, ఆయన భార్య పిల్లలతో బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దొంగలు, అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలను తెరిచి సుమారు 14 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.10 లక్షల నగదును అపహరించుకెళ్లారు.

## కాప్రాలో గ్యాస్ కొరత:

## ఆటో డ్రైవర్ల గంటల తరబడి నిరీక్షణ

**మల్కాజ్‌గిరి, మార్చి 28 పెన్ పవర్:** హైదరాబాద్‌లోని కాప్రా పరిధిలోని రాధికా ప్రాంతంలో గ్యాస్ కొరత కారణంగా వందలాది ఆటో రిక్షాలు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సమస్యతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ జీవనోపాధి కోసం ఆటో నడిపే డ్రైవర్లు గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో ఆదాయం కోల్పోతున్నారు. గంటల తరబడి వేచి ఉన్నప్పటికీ సరిపడా గ్యాస్ అందకపోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంక్షోభం మేడ్చల్, ఉప్పల్ ప్రాంతాలలోనూ ప్రభావం చూపుతోంది.

## ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య అరెస్ట్

**ఉప్పల్, మార్చి 28 పెన్ పవర్:** భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వేముల మారయ్య, నాచారంలో తన నివాసంలో అరెస్టు చేయబడ్డారు. ఇంద్ర పార్క్ వద్ద ఆశ వర్కర్లు తమ హక్కుల కోసం ధర్నా చేపట్టగా, వారిని అడ్డుకునేందుకు ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. పోలీస్ శాఖ ధర్నాకు అనుమతి ఇచ్చి అరెస్టు చేయడం సరికాదని, అయినప్పటికీ అసెంబ్లీని ముట్టడిస్తామని మారయ్య తెలిపారు.

## గాలివాన ప్రభావం కరెంట్ లేక కాలనీవాసుల ఆగ్రహం

**కుత్బుల్లాపూర్, మార్చి 28 పెన్ పవర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అపురూప కాలనీలో రాత్రి 9 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యపై స్పందించలేదని ఆరోపిస్తూ మాజీ ప్రెసిడెంట్ ఆలూరి వెంకట శేషాచారి, నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ తదితరులు విద్యుత్ కార్యాలయానికి వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఉరేసుకొని ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**ఇబ్రహీంపట్నం, మార్చి 28 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న కంది మల్ల సాయి (20) అనే ఇంజినీరింగ్ విద్యార్థి రాత్రి హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా శ్రీరంగాపురం గ్రామానికి చెందిన సాయి, ఉగాదికి ఇంటికి వెళ్లి వచ్చిన తర్వాత డిప్రెషన్‌లో ఉన్నట్లు స్నేహితులు తెలిపారు. యజమాని సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## దోమల బెడదపై ప్రభుత్వం స్పందించాలి:

**మేడ్చల్, మార్చి 28 పెన్ పవర్:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో దోమల బెడద అధికమైందని, దీనివల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. సాయంత్రం వేళల్లో బయట తిరిగే పెద్దలు, ఆడుకునే పిల్లలు దోమల వల్ల ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దోమల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వేసవిలో ప్రజలు ఉపశమనం కోసం బయటకు వస్తారని, వారిని దోమల బారి నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని రవి రాజ్ రాథోడ్ అన్నారు.

## విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు సాధనకు కృషి చేయాలి

**సూర్యాపేట, మార్చి 28 పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా ఉపాధ్యాయ ప్యానల్ తనిఖీ బృందం సభ్యులు కట్కూరి మధుసూదన్ రెడ్డి, శనివారం మునగాల మండలం శ్రీనివాసనగర్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, మెరుగుపరచడానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కారముంగిలో ఐఖఒ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**జహీరాబాద్, మార్చి 28 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం నాగలిగిద్ద మండలం కారముంగి గ్రామంలో శ్రీ శ్రీ మహాదేవ్ జాతర సందర్భంగా, కారముంగి ప్రీమియర్ లీగ్ (ఐఖఒ) క్రికెట్ టోర్నమెంట్ ను సర్పంచ్ పాటిల్ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అనిత గుండె రావు పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై, టోర్నమెంట్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రంలోని అమ్మాలి:



**అచ్చంపేట, మార్చి 28 పెన్ పవర్:** అచ్చంపేట నియోజకవర్గంలో రైతులకు మద్దతుగా, మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ సహకారంతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు. రైతులు తమ పంటను మధ్యవర్తుల వద్ద కాకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని, న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే సూచించారు.

# చీలిన ఓట్లు ఎవరికి తూట్లు

**హైదరాబాద్, మార్చి 28, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక పెను సంచలనం ముంచుకొస్తోంది. కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ అస్తిత్వం కోసం తెలంగాణ ప్రజా జాగృతి పేరిట కొత్త పార్టీని ప్రకటిస్తున్నారు. ఈ పరిణామం కేవలం ఒక కొత్త పార్టీ ఆవిర్భావం మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీ పునాదులను కదిలించే ఒక వ్యూహాత్మక చీలికగా చెప్పుకోవచ్చు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఉన్న అత్యంత బలమైన ఓటు బ్యాంకులో చీలిక తేవడమే కవిత ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఒక కొత్త పార్టీగా కవిత కేవలం 4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగినా, అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారనుంది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో దెబ్బతిన్న బీఆర్ఎస్, ఇప్పుడు కవిత రూపంలో ఎదురవుతున్న ఈ ఇంటి పోరు ను తట్టుకోవడం కష్టతరమే. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్, సాంస్కృతిక అంశాలపై పట్టున్న కవిత, బీఆర్ఎస్ కోర్ ఓటర్లను తనవైపు తిప్పుకుంటే ఆ పార్టీ కోలుకోవడం అసాధ్యం కావచ్చు.బీఆర్ఎస్ పార్టీలో ప్రస్తుతం కేటీఆర్ ఆధిపత్యం పెరిగిందని, సీనియర్లకు ప్రాధాన్యత తగ్గటంపై లోలోపల తీవ్ర అసంతృప్తి నెలకొంది. కేసీఆర్ మౌనం, హరీష్ రావు ఇరకాటం వంటి పరిస్థితులతో .. పార్టీలో గుర్తింపు లేని ద్వితీయ శ్రేణి నాయకులు, టిక్కెట్లు దక్కని ఆశావాహులు ఇప్పుడు కవిత వైపు చూస్తున్నారు. కవిత పార్టీ ప్రకటన వెలువడగానే, బీఆర్ఎస్ నుండి భారీగా వలసలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. అవకాశాలు రాని నేతలకు కవిత ఒక ప్రత్యామ్నాయ వేదికగా మారడం బీఆర్ఎస్ క్యాడర్‌ను నిలువునా చీల్చనుంది.కేటీఆర్, హరీష్ రావుల తీరుపై గుర్రుగా ఉన్న కవిత, తనపై జరిగిన రాజకీయ కుట్రలకు ప్రతీకారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ కవితతో సర్దుకుపోయే ప్రసక్తే లేదని సంకేతాలిస్తుంటే, అటు తండ్రిగా కేసీఆర్ వారించలేక, ఇటు పార్టీని కాపాడుకోలేక మౌనం వహిస్తున్నారు. ఈ అంతర్గత కలహాలు బీఆర్ఎస్ బలహీనపడటానికి ప్రధాన కారణం కానున్నాయి. కవిత పార్టీ పెట్టడం వెనుక ఉన్న బలమైన ఉద్దేశ్యం అధికారం కంటే కూడా, తనను దూరం పెట్టిన బీఆర్ఎస్ నేతలకు ఒక గట్టి పాఠం చెప్పడమేనని అర్థమవుతోంది.

కవిత చేయబోయే అధికారిక ప్రకటనతో తెలంగాణలో సరికొత్త సమీకరణాలు మొదలవుతాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ నుండి బయటపడిన తర్వాత బాధితురాలిగా ప్రజల్లోకి వెళ్లాలని ఆమె యోచిస్తున్నారు. వ్యక్తిగా వెళ్తున్నాను.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తాను అన్న ఆమె నినాదం ఇప్పుడు బీఆర్ఎస్ అధినాయకత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కవిత చీల్చే ప్రతి ఓటు కూడా బీఆర్ఎస్ విజయావకాశాలను దెబ్బతీస్తూ, పరోక్షంగా ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే అవకాశం ఉంది. ఈ సమస్యను అధిగమించే పరిష్కారం బీఆర్ఎస్ వద్ద కనిపించడం లేదు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కోదాడ లో నడి రోడ్డు పై కారు బోల్తా

**తుంగతుర్తి, మార్చి 28 పెన్ పవర్:** కోదాడలో సూర్యాపేట రోడ్డులోని జూడియో వద్ద నడి రోడ్డుపై ఒక కారు బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే, పిల్లలు ఆడుకునే కారు తలకిందులైనట్లుగా కారు బోల్తా కొట్టిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. నడి రోడ్డుపై కారు బోల్తా కొట్టడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ పనులకు సర్పంచ్ శంకుస్థాపన

**హుజూర్‌నగర్, మార్చి 28 పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా, చిలుకూరు మండల కేంద్రంలో శనివారం 12వ వార్డులో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ పనులకు గ్రామ సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం కింద పదిహేను లక్షల రూపాయలు మంజూరైనట్లు ఎంపీడీవో ఒక్క మొక్కపాటి నరసింహారావు తెలిపారు. ఈ నిధులతో 1, 2 వార్డులలో కూడా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగయ్య, గ్రామ కార్యదర్శి షర్ఫుద్దీన్, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## విషాదంలోను మానవత్వం చాటిన ఆ కుటుంబం

**భువనగిరి, మార్చి 28 పెన్ పవర్:** గుండాల మండలంలోని మాసాన్ పల్లి గ్రామంలో విషాదం నెలకొంది. బ్రెయిన్ డెడ్ అయిన బత్తిని హరీష్ గౌడ్ (24) అవయవాలను దానం చేసి ఎనిమిది మందికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. హైదరాబాదులో నివసిస్తున్న హరీష్ గౌడ్, నాలుగు రోజుల క్రితం బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. యశోద హాస్పిటల్‌లో ఐదు రోజులు వెంటిలేటర్‌పై చికిత్స పొందినప్పటికీ, వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. తల్లిదండ్రులు బత్తిని ఎల్లయ్య, మహేశ్వరి అవగాహనతో అవయవ దానానికి అంగీకరించారు. హరీష్ గౌడ్ అవయవాలు పలువురికి ప్రాణదాతగా మారాయి. విషాదంలోనూ మానవత్వం చాటుకున్న తల్లిదండ్రులను గ్రామస్తులు అభినందించారు.

## నడిరోడ్డుపై కాలి బూడిదైన కారు

**ఆలేరు, మార్చి 28 పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు వద్ద వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో మంటలు చెలరేగాయి. కారు ఏసీ ఆన్ చేయగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన భార్యాభర్తలు వెంటనే కారు దిగి పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. చూస్తుండగానే కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో హైవేపై కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ: లబ్ధిదారులకు రూ. 2.43 లక్షలు అందజేత



**బాల్కొండ, మార్చి 28 పెన్ పవర్:** నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గంలోని జక్రాన్ పల్లి మండల కేంద్రంలో శనివారం సుమారు ఏడుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) కింద మంజూరైన రూ. 2.43 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే భూపతి రెడ్డి సహకారంతో గ్రామ సర్పంచ్ బండి పద్మ సత్యం పంపిణీ చేశారు. నట్ట భూమన్న, బైరగోని రమేష్ గౌడు, చింతలపల్లి గంగు, చిలుకూరి గంగారెడ్డి, రీక్కల గంగ జమున, షేక్ షరీఫా, బాదావతు మంగ్యా అనే లబ్ధిదారులకు వారి వారి వాటాల ప్రకారం చెక్కులు అందాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్ పల్లి నర్సారెడ్డి, జిల్లా యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ సొప్పరి వినోద్, వార్డ్ సభ్యులు రుద్రాక్ష హేమంత్, స్వర్ణలత, సంజీవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇసుక ఆన్‌లైన్ బుకింగ్: ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు

**నిజామాబాద్ రూరల్, మార్చి 28 పెన్ పవర్:** ధర్పల్లి మండల ప్రజలకు తాహాసిల్దార్ శాంత ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 1, 2026 నుండి కొత్తగా ఇల్లు నిర్మించుకునేవారు 'మన ఇసుక వాహనం' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకోవాలని సూచించారు. ఇసుక రవాణాకు స్థానిక తాహాసిల్దార్, పంచాయతీ సెక్రెటరీ నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ నిబంధనలు నిజామాబాద్ జిల్లా, ధర్పల్లి మండలంలో అమల్లోకి వస్తాయి.

# జనగణనకు అంతా సిద్ధం

**హైదరాబాద్, మార్చి 28, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న జనగణన 2027 ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ భారీ ప్రక్రియలో పాల్గొనే అధికారులు, ఎన్యుమరేటర్లు ప్రజలతో ప్రవర్తించే తీరుపై రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ) కఠినమైన నిబంధనలను విధించింది. ముఖ్యంగా ప్రజలను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేలా లేదా అభ్యంతరకరమైన ప్రశ్నలు వేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించిందజనగణన సమయంలో ఉద్దేశపూర్వకంగా ప్రజలను అసంబద్ధమైన, ఇబ్బందికరమైన లేదా అభ్యంతరకరమైన ప్రశ్నలు అడిగే అధికారులకు జైలు శిక్ష తప్పదని రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ హెచ్చరించారు. ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. జనగణన చట్టం ప్రకారం.. విధుల్లో ఉండి ప్రజలను వేధించేలా ప్రవర్తించే అధికారులకు రూ. 1,000 జరిమానాతో పాటు మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని ఆయన గుర్తు చేశారు. నేరం తీవ్రతను బట్టి జరిమానా, శిక్ష, కొన్ని కేసుల్లో రెండూ విధించే అవకాశం ఉందని తెలిపారు.సాధారణంగా జనగణన సమయంలో అధికారులు అడిగే కొన్ని ప్రశ్నలు ప్రజలను అసౌకర్యానికి గురి చేస్తాయనే ఫిర్యాదులు గతంలో వినిపించాయి. ఈ నేపథ్యంలోనే జనగణన ప్రక్రియ పారదర్శకంగా, హుందాగా సాగాలని కేంద్రం భావిస్తోంది. అధికారులు కేవలం నిర్దేశించిన ఫారమ్‌లలో ఉన్న ప్రశ్నలను మాత్రమే అడగాలని, వ్యక్తిగత విమర్శలు లేదా అనవసరమైన ఆరా తీయడం వంటివి చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది.

జనగణన ద్వారా సేకరించిన సమాచారం అత్యంత వ్యక్తిగతమైనదని, దీనిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని కేంద్రం స్పష్టం చేసింది. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాల ముందస్తు అనుమతి లేకుండా.. సేకరించిన సమాచారాన్ని బయటి వ్యక్తులకు లేదా సంస్థలకు బహిర్గతం చేయడం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందని పేర్కొంది. సమాచార గోప్యతను ఉల్లంఘించే అధికారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్జీఐ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.మరోవైపు తొలిసారిగా జనగణనలో కుల గణనను కూడా చేర్చనున్న సర్కారు.. వీటి నిర్వహణ కోసం రూ. 11,718 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. స్వాతంత్ర్యం తర్వాత జరగనున్న 16వ జనాభా గణన పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరగనుండగా.. పౌరులకు స్వీయ గణన ఎంపికను కూడా అందిస్తోంది.

# కారు వరుస కష్టాలెన్నో..

**హైదరాబాద్, మార్చి 28, పెన్ పవర్:** తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ రానున్న ఎన్నికల్లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంటుంది. కేవలం ప్రత్యర్థులతో మాత్రమే కాదు.. ఇంటి పార్టీ నుంచి కూడా కారు పార్టీకి కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడనున్నాయి. అలాగే కాంగ్రెస్ కూడా బలంగా కనిపిస్తుంది. రెండో సారి కూడా తమదే అధికారమన్న ధీమాతో ఆ పార్టీ నాయకత్వం ఉంది. బీజేపీని తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. ప్రతి రాష్ట్రంలో వరసగా అధికారాన్ని చేజిక్కించుకుంటూ వస్తున్నకమలం పార్టీ ఈసారి కారు పార్టీకి గట్టి ఛాలెంజ్ ను ఎదుర్కొనాల్సి ఉంటుంది.ఇక కల్వకుంట్ల కుటుంబం నుంచి కవిత బయటకు వచ్చేశారు. వచ్చే నెల 25వ తేదీన కొత్త పార్టీని ప్రకటించనున్నట్లు కవిత తెలిపారు. దీంతో ఆమె కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్, బీజేపీలనుకూడా లక్ష్యంగా చేసుకుంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఇప్పటికే అధికారంలో ఉండటంతో ఆ రెండు పార్టీలపై విమర్శలను ఒకవైపు చేస్తూనే, తాను తెలిసిన, తాను ఎరిగిన బీఆర్ఎస్ పాలనలో అవినీతిని కవిత ఎన్నికల వేళ బయటపెట్టే అవకాశాలున్నాయి. మిగిలిన పార్టీల విమర్శల కంటే కవిత చేసే విమర్శలు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను రాజకీయంగా ఇబ్బంది పెట్టనున్నాయి.పక్కన పెడితే మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జనంలోకి ఇప్పటి వరకూ రాలేదు. ప్రజా సమస్యలపై పెద్దగా స్పందించింది లేదు. ఆయన ఫామ్ హౌస్ దాటి బయటకు రావడం లేదు. గతంలో మాదిరిగా తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన వ్యక్తిగా ఉన్న ఇమేజ్ వచ్చే ఎన్నికలకు ఉండదనేది విశ్లేషకుల అంచనా. ఈ సారి ఎన్నికల్లో అనేక కారణాలు ఓటర్లపై ప్రభావం చూపుతాయి. సంక్షేమ పథకాలు ఎప్పుడూ మొదటి స్థానంలోనే నిలిచినా, అభివృద్ధితో పాటు అధికార పార్టీపై సహజంగా వెలువడే వ్యతిరేకతను సొమ్ము చేసుకోవాలంటే ఖచ్చితంగా కేసీఆర్ యాక్టివ్ కావాల్సిందేనన్నది రాజకీయ విశ్లేషకుల మాట. మరి కేసీఆర్ ఎన్నికల సమయానికి జనం ముందుకు వస్తే అది పెద్దగా సత్ఫలితాలనివ్వకపోవచ్చు.



# 18 టెన్త్ ఎగ్జామ్స్ యథావిధిగా ఉంటాయి క్లారిటీ ఇచ్చిన విద్యా కమిషన్

**హైదరాబాద్, మార్చి 28, పెన్ పవర్:** తెలంగాణలో టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ జరుగుతున్న సమయంలో వచ్చే ఏడాది నుంచి వీటిని రద్దు చేస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. తెలంగాణలో సెకండరీ స్కూల్ సర్టిఫికేట్ పరీక్షలను రద్దు చేస్తున్నారనే వదంతులపై తెలంగాణ విద్యా కమిషన్ క్లారిటీ ఇచ్చింది. ప్రభుత్వ పరిశీలనలో అటువంటి ప్రతిపాదనేదీ లేదని ఎజుజ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం 2026 విధాన పత్రాన్ని విడుదల చేసిన తర్వాత తెలంగాణలో ూాజ పరీక్షల రద్దుపై పుకార్లు మొదలయ్యాయి. ఆ డాక్యుమెంట్‌లో ఎస్ఎస్‌సి బోర్డును ఇంటర్మీడియట్ బోర్డుతో విలీనం చేయడం వంటి సంస్కరణలను సూచించారు. పదో తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేయాలని ఎక్కడా సూచించలేదు. అయితే, కొన్ని ప్రైవేట్ స్కూల్స్ 11, 12 తరగతులను స్కూల్లో మొదలుపెట్టాయి. దాంతో టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ రద్దు అని వదంతులు త్వరగా వ్యాపించాయి.తెలంగాణ రాష్ట్రంలో మార్చి 14న ప్రారంభమైన పదో తరగతి బోర్డు పరీక్షలు ఏప్రిల్ 16 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలను ప్రభుత్వం 6 పేపర్ల విధానంలో నిర్వహిస్తోంది. ప్రతి రోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు (3 గంటల పాటు) పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 2,676 ఎగ్జామ్ సెంటర్లలో సుమారు 5,28,239 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు.

నిబంధనల విషయానికి వస్తే, విద్యార్థులకు కేవలం 5 నిమిషాల ఆలస్య అనుమతి మాత్రమే ఉంటుంది. పరీక్షలు ముగిసిన అనంతరం, ఫలితాలను ఏప్రిల్ చివరి వారం లేదా మే 2026లో విడుదల చేసే అవకాశం ఉంది.తెలంగాణ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యా రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు.జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో ప్లస్ టూ (+2) విద్యా విధానాన్ని మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. విద్యా సంస్కరణలపై నియమించిన కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోందని, వారు సమర్పించేది ప్రాథమిక నివేదిక మాత్రమేనని, అది తుది నిర్ణయం కాదని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.ప్రస్తుతం పదో తరగతి బోర్డు పరీక్షల రద్దుపై ప్రభుత్వం ఎటువంటి అధికారిక ఉత్తర్వులు (+ూ) జారీ చేయలేదు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చే సిఫార్సులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది. తెలంగాణలో టెన్త్ పరీక్షల రద్దుపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని, విద్యార్థులు తమ ప్రిపరేషన్‌ను యథావిధిగా కొనసాగించాలని సూచించారు.

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక

**హైదరాబాద్ పెన్ పవర్:** నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతుకుతున్న వారి స్వేచ్ఛకోసం, తమ జీవితాన్ని త్యజించిన వారిలో 'సర్దార్ జమలాపురం కేశవరావు' ముందు వరుసలో నిలుస్తారు. కట్టెదుట జరుగుతున్న అన్యాయాలకు చూస్తూ, సహిస్తూ ఉండలేక ప్రజల్లో ధైర్య సాహసాలను నూరిపోయడమే ఏకైక లక్ష్యంగా జీవితాంతం మందుకు సాగారు. హైదరాబాద్ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీకి జీవంపోసి, ప్రజా శ్రేయస్సు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిబద్ధత కలిగిన నేత, త్యాగశీలి సర్దార్ జమలాపురం కేశవరావు. సత్యాగ్రహిగా, క్విట్ ఇండియా ఉద్యమ కార్యకర్తగా, ఆంధ్రమహాసభ నిర్వాహకుడిగా, గ్రంథాలయోద్యమ నిర్మాతగా, ఆదివాసీ, దళిత జనోద్ధారకుడిగా, పత్రిక స్థాపకుడిగా ఇలా కొన్ని ఎన్నో కార్యకలాపాలు చేపట్టి హైదరాబాద్ రాజ్య ప్రజల్లో చైతన్యాన్ని, ధైర్యాన్ని నింపిన మహోన్నతుడు కేశవరావు. అందుకే ఆయన్ను అందరూ తెలంగాణ 'సర్దార్'గా పిలుచు కుంటారు.తెలంగాణ కేసరిగా, 'దక్కన్ సర్దార్'గా బిరుదులందుకున్న జమలాపురం కేశవరావు తనదైన శైలిలో ఉద్యమాలు నడిపి కాంగ్రెస్‌కు, తెలుగు వారి ముఖ్యంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోశారు. దక్కన్ సర్దార్‌గా, ఉక్కు మనిషిగా ప్రజలు పిలుచుకునే కేశవరావు నిజాం సంస్థానంలో తూర్పు భాగాన ఉన్న ఖమ్మం (నాటి వరంగల్ జిల్లా)లోని ఎర్రుపాలెంలో 1908, సెప్టెంబర్ 3 న జమలాపురం వెంకట రామారావు, వెంకట నరసమ్మలకు తొలి సంతానంగా జన్మించారు. సంపన్న జమీందారీ వంశంలో పుట్టినా, నాటి దేశ రాజకీయాలు అతనిని తీవ్రంగా కలవర పరచాయి. ఎర్రుపాలెం లో ప్రాథమిక విద్య అనంతరం, హైదరాబాదులోని నిజాం కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. వందేమాతరం గీతాలాపనను నిషేధించి నందుకు నిరసనగా, కళాశాల విద్యార్థులను కూడగట్టి, నిరసనోద్యమంలో కాలూనారు. గీతాన్ని ఆలాపించ నివ్వకపోతే తరగతులకు హాజరు కాబోమని హెచ్చరించారు. దీంతో చివరకు నిజాం పాలకవర్గం నిషేధాన్ని ఎత్తివేయక తప్పలేదు. ఈఘటన తర్వాత కేశవరావు ఆలోచనా పరిధి మరింత విస్తృతం అయింది. నిజాం పాలనలో కొనసాగుతున్న వెట్టి చాకిరితో అష్టకష్టాలకు గురవుతున్న ప్రజలను చూసిన కేశవరావు చలించి పోయారు. ప్రజలను విముక్తం చేయడానికి తెలంగాణ జిల్లాల్లో...ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కేశవరావు కాలినడకన విస్తృతంగా పర్యటించారు. ఆ క్రమంలోనే భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల, గాంధీ సిద్ధాంతాల పట్ల కేశవరావు ఆకర్షితుడయ్యారు.

1923లో రాజమండ్రిలో మొదటిసారి మహాత్మా గాంధీ ఉపన్యాసాన్ని విన్న కేశవరావు, 1930లో విజయవాడలో జరిగిన సభలో గాంధీ పరిచయంతో మరింత ఉత్తేజితుడైనాడు. ఆంధ్రపితామహుడుగా మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన గ్రంథాలయ ఉద్యమంను తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రచారం గావించారు. వయోజన విద్యకై రాత్రి పాఠశాలలు నడపడంలో కేశవరావు కృషి చేశారు. అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని నింపడానికి ప్రత్యేక శ్రద్ధను కనపరిచేవారు. 1938లో దీపావళి సందర్భంగా ఆవిర్భవించిన 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' స్థాపనలో కేశవరావు కీలకపాత్ర వహించి, దానికి మొదటి అధ్యక్షుడయ్యారు. 1938 సెప్టెంబర్ 24 మధ్యాహ్నం మధిరలో గోవిందరావు నానక్, జనార్దనరావు దేశాయ్, రావి నారాయణరెడ్డిలతో కలిసి సత్యాగ్రహ దీక్షకు కేశవరావు సిద్ధమయ్యాడు. ఎట్టి పరిస్థితుల్లో సర్దార్‌ను దీక్ష చేయనివ్వొద్దని నిజాం ప్రభుత్వం అనుమతి నివ్వలేదు. మధిరలో అడుగడుగునా పోలీసులను మోహరించింది. అయినా భారీ సంఖ్యలో ప్రజలు దీక్ష వేదిక దగ్గరకు చేరుకున్నారు. అప్పుడే ఎవరూ ఊహించని విధంగా రైతు వేషంలో దీక్ష వేదిక దగ్గరకు వచ్చాడు కేశవరావు. వెంటనే మహాత్మాగాంధీకి జై, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ జై అని దిక్కులు పెక్కటిల్లేలా నినాదించారు. అరెస్టు చేసి నిషేధాన్ని ఉల్లఘించి సత్యగ్రహ దీక్ష చేశారంటూ కేశవరావుకు 18 నెలలు జైలు శిక్ష విధించారు. వరంగల్ జైలులో ఎనిమిది నెలల శిక్షను అనుభవించిన తర్వాత కేశవరావుతో సహా రాజకీయ ఖైదీలందరినీ నిజామాబాద్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా అదే పోరాట పంథాను కేశవరావు కొనసాగించారు. అంటరానితనం నిర్మూలించేందుకు, ఆదివాసీల అభివృద్ధికి కూడా ఉద్యమం చేశారు. 1942లో కాంగ్రెస్ పిలుపు మేరకు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని తెలంగాణలో ఊరూరా ప్రచారం చేసే బాధ్యత వహించారు. 1946లో మెదక్ జిల్లా కందిలో కేశవరావు అధ్యక్షతన జరిగిన 13వ ఆంధ్ర మహాసభ సందర్భంగా నిర్వహించిన బ్రహ్మాండమైన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. 1947 ఆగస్టు 7న మధిరలో స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన సత్యాగ్రహం మరువలేనిది. దానికి బాధ్యుడైన కేశవరావుకు ప్రభుత్వం రెండు సంవత్సరాలు కారాగార శిక్ష విధించింది. యావత్ భారత దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చు కోవడానికి ఉవ్విళ్లూరుతున్న సందర్భంలో కేశవరావు వంటి నాయకులు నిర్భంధానికి గురికావడం ఒక విషాదం. నిజాం సంస్థానం భారత దేశములో విలీనమైన తరువాత, 1952లో కేశవరావు రాజ్యసభకు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌పై పోలీసు చర్య అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలను తీవ్రంగా నిరసించిన మొట్టమొదటి కాంగ్రెస్ వ్యక్తి కేశవరావు. అప్పటి మిలిటరీ అధికారి నంజప్పను నిలదీసిన నిజమైన ప్రజానాయకుడు సర్దార్. కాంగ్రెస్ పార్టీలో ఉండి జాగీర్దార్లను, జమిందార్లను విమర్శించమంటే ఆనాడు నిజంగా ఒక సాహసమే. నంజప్ప నేతృత్వంలో మిలిటరీ వారు కమ్యూనిస్టుల ఏరివేత పేరిట జరిగిన హింసా కాండను, ముస్లిముల ఊచకోతను కేశవరావు ఖండించారు. ప్రజల పక్షాన నిలిచారు. "మనం ఏ ప్రభుత్వాన్ని అయినా సరే అది రాష్ట్ర, జాతీయ ప్రభుత్వం, కాంగ్రెసు ప్రభుత్వం అయినా, కాంగ్రెసు కాని ప్రభుత్వం అయినా అమాయక ప్రజలపై అత్యాచారాలు జరపడాన్ని సహించబోము. నంజప్ప మన ప్రభుత్వంలో ఒక అధికారి మాత్రమే. యింకా స్పష్టంగా చెప్పాలంటే ఆయన మన ప్రజలకు సేవకుడు. ఆయన యధేచ్ఛగా ప్రవర్తించడానికి, మేము అనుమతించడానికి సిద్ధముగా లేము. ఆయన చేస్తున్న అకృత్యాలు నిజాం తొత్తులైన జాగీర్దార్లను, నాజీ హిట్లరును తలదన్నిన నిజాంను మరిపిస్తున్నది. నంజప్ప తెలంగాణ రక్షకుడిగా కాక, భక్షకుడిగా వచ్చినట్లు అనిపిస్తున్నది." అని దోర్నకల్లులో జరిగిన సభలో కేశవరావు ఎలుగెత్తి చాటారు.సర్దార్ కేశవరావు భాషారాష్ట్ర సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకి. తెలంగాణ అస్తిత్వాన్ని స్థిరీకరించాలని కోరుకున్నారు. కన్నడ, మరాఠీ భాషా ప్రాంతాలతో కలిసి పోయిన హైదరాబాద్ రాష్ట్రం అలాగే ఉండాలని వాంచించారు. అలాగే జమిందారి, జాగిర్దారీ వ్యవస్థలతో అతలాకుతలమైన

తెలంగాణను విశాలాంధ్రలో కలిపినట్లయితే ఏమాత్రం మేలు జరగదని నొక్కి చెప్పారు. విద్యాపరంగా, సామాజిక, ఆర్థిక రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయకుండా విశాలాంధ్ర ఏర్పాటు వల్ల స్థానికులపై స్థానికేతరుల అజమాయిషీ ఆరంభ మవుతుందని ముందుగానే ఊహించిన అనుభవశాలి ఆయన. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ సభలు, సమావేశాలు జరిగినపుడు ఒక సామాన్య కార్యకర్త మాదిరిగా పందిళ్ళు వేయడానికి, కర్రలు కూడా నాటి నిరాడంబరతకు, పార్టీ పట్ల అంకితభావంకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి, అంతలా పార్టీకి సేవ చేసిన ఆయనకు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల మూలంగా రావాల్సినంత పేరు, దొరకాల్సిన గౌరవం రాలేదు. చేపట్టిన ప్రతి ఉద్యమం లోనూ విజయాల్ని సాధించిన ఆయన స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనకు ద్రోహం చేశారు. ఆయన ఎదుగుదలను అడ్డుకున్నారు. ఎన్నికల్లో ఓటమి చెందేలా పరిస్థితులు కల్పించారు. జైలు జీవితం, ఉద్యమ సమయంలో భోజనం లేకపోవడం, పార్టీలోని నాయకులు చేసిన మోసం, కలగలిసి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అయిన కేశవరావు1953, మార్చి 29న తన 46వ ఏట మరణించారు.

# తెలంగాణలో టిడిపి నామమాత్రమేనా!

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తెలుగు నేలపైనే కాదు, భారతదేశ రాజకీయ చరిత్ర లోనే ప్రత్యేకత సంతరించుకుంది. దేశంలోని ఏ ప్రాంతీయ పార్టీకి లేని ఎన్నో ప్రత్యేకతలు తెలుగుదేశంకు సొంతం. నట సార్వభౌముని రాజకీయ రంగ ప్రవేశంతో, ఒకనాడు తెలుగు సీమను ఏకఛత్రాధిపత్యంగా ఏలిన తెలుగు దేశం పార్టీ, 44 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో అనూహ్య ఆటుపోట్లు ఎదుర్కొని, విభక్త ఆంధ్రావనిలో తెలంగాణలో నేడు కరుడుగట్టి కునికి పోవడానికి సిద్ధమైంది. 1978లో ఆంధ్ర ప్రదేశ్లో అధికారానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటల వల్ల తరచూ ఐదు సంవత్సరాల కాలంలో నలుగురు ముఖ్య మంత్రులు మారారు. ముఖ్య మంత్రిని ఢిల్లీలో నిర్ణయించి, రాష్ట్రంలో శాసన సభ్యుల చేత నామకార్థం ఎన్నిక చేయించేవారు. ఈ పరిస్థితి కారణంగా ప్రభుత్వం కాంగ్రెస్ అంటే వెగటు పుట్టే పరిస్థితి ఏర్పడింది. 1981లో ఊటీలో సర్దార్ పాపారాయుడు చిత్రం షూటింగు విరామ సమయంలో ఎన్టీఆర్ ను ఒక విలేఖరి, మీకు ఇంకో 6 నెలల్లో 60 సంవత్సరాలు నిండు తున్నాయి కదా, మరి మీ జీవితానికి సంబంధించి ఏదైనా నిర్ణయం తీసుకుంటున్నారా? అన్న ప్రశ్నలు జవాబుగా తెలుగు ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు. వారికి నేనెంతో రుణపడి ఉన్నాను. కాబట్టి నా తరువాతి పుట్టిన రోజునుంచి నా వంతుగా ప్రతీ నెలలో 15 రోజులు తెలుగు ప్రజల సేవకోసం కేటాయిస్తాను అని చెప్పారు. ఎన్టీఆర్ తన మనసులో మాట బహిర్గతం చేయకుండా, తాను నటించ వలసిన సినిమాలు త్వర త్వరగా పూర్తి చేసారు. 1982 మార్చి 21 న హైదరాబాదు రావడం జరిగింది. 1982 మార్చి 29 నాటి మధ్యాహ్నం 2:30లకు కొత్త పార్టీ పెడుతున్నట్లు ప్రకటించారు. ఆ సమయం లోనే తన పార్టీ పేరు తెలుగు దేశంగా నిర్ణయించి, పార్టీ ప్రచారానికై తన పాత చెవ్రోలెటు వ్యానును బాగు చేయించి, దానిని ఒక కదిలే వేదికగా (చైతన్య రథం) తయారు చేయించారు. దానిపై నుండే ప్రచారం నిర్వహించారు. ఆ రథంపై రాజకీయాల్లో ఎన్నో రథాలకు ఈ చైతన్య రథమే స్ఫూర్తిగా నిలిచింది. ఎన్టీఆర్ ప్రజలను చైతన్య పరుస్తూ చైతన్య రథంపై ఆంధ్ర ప్రదేశ్ నలు మూలలకూ ప్రచార యాత్రను సాగించారు. చైతన్య రథమే ప్రచార వేదికగా, నివాసంగా మారి పోయింది. నిరంతరం ప్రయాణిస్తూ, ఉపన్యాసాలిస్తూ ప్రజల హృదయాలను దోచు కున్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవ పరిరక్షణ అనే ఒక ఉద్వేగ భరితమైన అంశాన్ని తీసుకుని ప్రజల మనోభావాలను తీవ్రంగా ప్రభావితం చేసారు. ఎన్టీఆర్ ప్రసంగాలు ఉద్వేగ భరితంగా, ఉద్రేక పూరితంగా ఉండి, ముఖ్య మంత్రులను తరచూ మార్చడం... అదీ ఢిల్లీ పెద్దల నిర్ణయం ప్రకారమే తప్ప, శాసన సభ్యుల మాటకు విలువ లేక పోవడం వంటి వాటిని లక్ష్యంగా చేసుకుని తన ప్రసంగాలను మలచు కున్నారు. కాంగ్రెసు నాయకులు అధిష్టానం చేతిలో కీలుబొమ్మలనీ తీవ్ర పదజాలం తో విమర్శించారు. కాంగ్రెసు పార్టీ కారణంగా తెలుగువారి ఆత్మగౌరవం దెబ్బతిన్నదని, దాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని విమర్శిస్తూ, సదరు ఆత్మగౌర పరిరక్షణకే తాను రాజకీయాల లోకి వచ్చానని చెప్పారు. కాంగ్రెసు నిర్వాకానికి అప్పటికే విసుగు చెందిన, ప్రజలు ఆయన నినాదం పట్ల ఆకర్షితు లయ్యారు. 1983 జనవరి 7 న మధ్యాహ్నం ఎన్నికల ఫలితాల ను ప్రకటించారు. తెలుగుదేశం 199, కాంగ్రెసు 60, సిపిఐ 4, సిపిఎం 5, బిజెపి 3 సీట్లు గెలుచు కున్నాయి. 97 ఎళ్ళ సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెసు పార్టీ 9 నెలలు తెలుగుదేశం పార్టీ చేతుల్లో ఓడి పోయింది. జాతీయ స్థాయిలో లోక్ సభలో ప్రతిపక్షంగా ఉన్న మొదటి ప్రాంతీయ పార్టీగా టీడీపీ చరిత్రలో నిలిచింది. రామారావు మూడు మార్లు ముఖ్యమంత్రిగా 8 సంవత్స రాల పాటు పనిచేశారు. నాదెండ్ల భాస్కరరావు 1983 ఆగస్టులో దొడ్డి దారిన ఎన్టీఆర్ పదవిని ఇందిరాగాంధీ సాయంతో లాక్కున్నారు. ఆరోగ్య కారణలతో అమెరికా వెళ్లి తిరిగి వచ్చిన ఎన్టీఆర్ తీవ్ర ఆగ్రహంతో తన ఎమ్మెల్యేలతో ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇందిరా గాంధీ చేసేది లేక తిరిగి ఎన్టీఆర్ ను ముఖ్యమంత్రి గా చూడక తప్పలేదు. ఎన్టీఆర్ 1984 లో మధ్యంతర ఎన్నికలకు వెళ్లి 200 పైగా అసెంబ్లీ సీట్లు సాధించి రెండవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 1989లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయి తెలుగుదేశం పార్టీ అధికారం నుండి తప్పుకుంది. ఆ 1989 లోక్సభ ఎన్నికల్లో కేవలం రెండు స్థానాలకే టీడీపీ పరిమితం అయిపోయింది. ఎన్టీఆర్ సారథ్యంలో టీడీపీ మొదటి నుంచీ జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసింది. 1989లో నేషనల్ ఫ్రంట్ తరపున వీపీ సింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో, 1996లో యునైటెడ్ ఫ్రంట్ తరపున దేవెగౌడ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో, తరువాత ఎన్డీఎలో కీలక పాత్ర పోషించింది. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఉన్న ప్రాంతీయ పార్టీలను చిన్న చిన్న జాతీయ పార్టీలను ఒక తాటి పైకి తెచ్చి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా "నేషనల్ ఫ్రంట్" కూటమిని స్థాపించి కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకుని వి.పి.సింగ్ ని ప్రధానిని చేశారు. ఎన్టీఆర్ "నేషనల్ ఫ్రంట్"కు చైర్మన్ గా వ్యవహరించారు. 1994లో తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారం లోకి వచ్చింది. రామా రావు మూడవ సారి ఆంధ్రపదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు. లక్ష్మీ పార్వతి పాలనా వ్యవహారాలలో రాజ్యాంగేతర శక్తిగా కలుగ జేసుకుంటున్న ఆరోపణలతో 1995లో, అప్పటి రెవిన్యూ మంత్రి అయిన నారా చంద్రబాబు నాయుడు, రామారావు నుండి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అత్యధిక మంది ఎమ్మెల్యేలు చంద్రబాబుకు మద్దతు ప్రకటించడంతో, ఎన్టీఆర్ అధికారం కోల్పో వలసి వచ్చింది. 1995వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీలో సంభవించిన పరిణామాల నేపథ్యంలో చంద్రబాబు నాయుడు అధికారాన్ని చేజిక్కించు కున్నారు. అప్పటి నుండి 2004వ సంవత్సరం వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి, అత్యధిక కాలం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజకీయ నాయకునిగా చరిత్ర సృష్టించారు చంద్రబాబు నాయుడు. 1996 జనవరి 18న ఎన్టీఆర్ అనారోగ్యంతో తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయారు. రాష్ట్ర విభజన కూడా తెలుగు దేశాన్ని కోలుకొని దెబ్బ తీసింది. ఆంధ్రప్రదేశ్ లో

ఒకసారి అధికారం చేపట్టి, జగన్ ధాటికి తాళలేక అధికారానికి దూరంగా ఉండి,... ప్రస్తుతం జనసేన, భారతీయ జనతా పార్టీ పొత్తులతో ఎన్నికలలో గెలిచి చంద్రబాబు నేతృత్వంలో అధికారం చేపట్టారు. ఉమ్మడి ఏపీలోని పార్టీని కేవలం ఆంధ్రా పార్టీగా చూపించడంలో కేసీఆర్ సఫలం అయ్యారు. తెలుగుదేశం తమను తాము జాతీయ పార్టీగా చెప్పు కుంటుంది. కానీ 2018 ఎన్నికల తరువాత తెలంగాణలో టీడీపీ గుర్తింపు పొందిన పార్టీ హోదా కూడా కోల్పోయింది. తెలంగాణ రాష్ట్రంలో తెరాస అధినేత కేసీఆర్ నేతృత్వంను సమర్థిస్తూ, గతంలో సత్తుపల్లి నుండి గెలుపొందిన సండ్ర వెంకట వీరయ్య, అశ్వరావు పేట నుండి తెదేపా నుండి విజయం సాధించిన ఎ. నాగేశ్వరరావు టిడిపిని వీడి, తెరాసలోకి వలస వెళ్ళారు. తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచిన వారినందరినీ తెరాస అధినేత తమ వైపుకు లాక్కున్నారు. నాయకులే కాదు, టీడీపీ కార్యకర్తలు కూడా అదే స్థాయిలో టీఆర్ఎస్ వైపు వెళ్ళారు. చివరకు తెలంగాణ టిడిపి అధ్యక్షుడు ఎల్. రమణ రాజకీయ జన్మనిచ్చిన పార్టీ బంధాలు, అనుబంధాలు తెంచుకుని తెరాస తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ అయ్యారు. ఇటీవల కాసాని జ్ఞానేశ్వర్ సైతం తెరాసలో చేరి, ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైనారు. ప్రస్తుతం సమర్థ నాయకత్వ లేమితో అత్యంత దయనీయ స్థితిలో కొట్టమిట్టాడుతున్నది. ప్రస్తుతం తెలంగాణలో చుక్కాని లేని నావలా తెలంగాణ టిడిపి కనీవినీ ఎరుగని రీతిలో నామమాత్రంగా మిగిలి ఉంది.

## కామన్ వర్క్ షెడ్ ను ప్రారంభించిన ఎంపీ అరుణ

**నారాయణపేట, మార్చి 28 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా తిర్మలాపూర్ లో ఎంపీ డీకే అరుణ తిరుమలనాథ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం, ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ. 10 లక్షలతో నిర్మించిన కామన్ వర్క్ షెడ్ ను ఆమె ప్రారంభించారు. భక్తులు, గ్రామస్తుల అభ్యర్థన మేరకు మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ ను కూడా ప్రారంభించారు. బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ టవర్ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని, త్వరలో టవర్ ఏర్పాటు చేస్తామని ఎంపీ తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## తాత మరణం తట్టుకోలేక మనవడు ఆత్మహత్య

**వనపర్తి, మార్చి 28 పెన్ పవర్:** వనపర్తి మండలం రాజనగరంలో నక్క రాకేశ్ (20) అనే యువకుడు తాత మరణంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు వనపర్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తాతపై ఉన్న మమకారంతో యువకుడు తనువు చాలించడం గ్రామంలో విషాదం నింపింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, గోపి మాధవిలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## కోదాడ పబ్లిక్ క్లబ్ ఎన్నిక: సీతారామిరెడ్డి, రంగారావు ఏకగ్రీవం



**కోదాడ, మార్చి 28 పెన్ పవర్:** సూర్యాపేట జిల్లా కోదాడ పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడిగా కత్రం సీతారామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పోటు రంగారావుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక గత నెల రోజులుగా జరిగిన ప్రయత్నాలకు ఫలితంగా నిలిచింది. ఆదివారం నాడు ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరగనుంది. ఈ ఏకగ్రీవ ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్

**అశ్వారావుపేట, మార్చి 28 పెన్ పవర్:** జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తెలిపిన వివరాల ప్రకారం, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుంది. పెండింగ్ కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి ఇది కక్షిదారులకు ఒక అద్భుతమైన అవకాశమని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమతో పాటు ఖర్చులను తగ్గించుకోవాలని జిల్లా న్యాయమూర్తి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సాయనపేట అడవికి నిప్పు

**ఇల్లందు, మార్చి 28 పెన్ పవర్:** టేకులపల్లి మండలంలోని తొమ్మిదోమైలుతండా పంచాయతీ పరిధిలోని సాయనపేట గ్రామ సమీపంలోని అడవికి గురు, సాయంత్రం సమయాల్లో నిప్పు అంటుకుంది. పశువులు, మేకల కాపరులు ధూమపానం చేసి పడేసిన చుట్ట, బీడీల వల్ల అడవి దహనమవుతోందని సమాచారం. దీనిపై అటవీశాఖ సిబ్బంది తక్షణమే చొరవ తీసుకోవాలని కోరారు.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన చైర్ పర్సన్



**నర్సంపేట, మార్చి 28 పెన్ పవర్:** వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు మాదన్నపేటలో శనివారం మహిళలకు ఇందిరమ్మ చీరలను నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, స్థానిక వార్డు కౌన్సిలర్ కొత్తకొండ మేఘన శ్యామ్ రాజ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ, మహిళల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు.

## నాగారం డ్రైనేజీ కాలువకు శంకుస్థాపన

**వర్ధన్నపేట, మార్చి 28 పెన్ పవర్:** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు, హసన్పర్తి మండలం నాగారం గ్రామంలోని పదవ వార్డులో శనివారం డ్రైనేజీ కాలువకు సందరాజు లావణ్య సంతోష్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హసన్పర్తి మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ అన్వర్ ఖాన్, గ్రామ కార్యదర్శి గరిగే ప్రశాంతి, ఉప సర్పంచ్ కోట వాసు, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మరియు కారోబార్ కుక్కముడి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన నాగారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా జరిగింది.

## అనారోగ్యంతో విద్యార్థిని మృతి

**ములుగు, మార్చి 28 పెన్ పవర్:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పత్తిపాక తండాకు చెందిన 14 ఏళ్ల బి. స్నితిక అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందింది. ఆమె తల్లిదండ్రులు సాగర్-వాణి తమ పిల్లల చదువుల కోసం హనుమకొండలో నివసిస్తున్నారు. 9వ తరగతి చదువుతున్న స్నితిక కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచింది.

## విషాదం.. వాగులో పడి వ్యక్తి మృతి

**మహబూబాబాద్, మార్చి 28 పెన్ పవర్:** బయ్యారం మండలంలోని అలిగేటి వాగులో ప్రమాదవశాత్తు పడి గొర్ల కాపరి రాములు (55) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గొర్లను మద్ది చెట్టు మడుగు వద్ద వాగు దాటించే క్రమంలో నీటిలోకి దిగిన రాములు, గొర్లతో పాటు ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు ప్రయత్నించగా, ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందినట్లు తెలుస్తోంది. శనివారం అటుగా వెళ్లిన రైతులు గమనించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సీఎం సహాయనిధి చెక్కులు: మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ



**నారాయణఖేడ్, మార్చి 28 పెన్ పవర్:** శనివారం, సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ నియోజకవర్గంలోని ఖానా పూర్ (కె) గ్రామంలో కల్హేర్ మండలంలోని క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్య, చాకలి నిర్మల కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రాంసింగ్, ఫ్యాక్స్ మాజీ వైస్ చైర్మన్ రామిరెడ్డి, హనమద్లు, శ్రీనివాస్ గౌడ్, పిరయ్య, బిఆర్ఎస్ నాయకులు పెండా రాములు, యువత అధ్యక్షులు పండరి, చంద్ర శేఖర్ రెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

## చిన్నచెల్మెడలో సీతారాముల కళ్యాణం: కాంగ్రెస్ నేతల హాజరు

**ఆందోల్, మార్చి 28 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధిలోని మునిపల్లి మండలం చిన్నచెల్మెడ గ్రామంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణానికి మండల కాంగ్రెస్ పార్టీ నేతలు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం కార్యనిర్వాహకులు, గ్రామ సర్పంచ్ రుద్ర గాయత్రి కృష్ణ వారికి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రెండు ఆర్టీసీ బస్సులు ఢీ.. ఇద్దరికి గాయాలు

**హుస్నాబాద్, మార్చి 28 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ వద్ద రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. హైదరాబాద్ వెళ్తున్న ఎలక్ట్రికల్ బస్సు ముంబాయి జాతీయ రహదారి ఇస్నాపూర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, సంగారెడ్డి డిపో నుంచి వచ్చిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలవగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండు బస్సుల అద్దాలు ధ్వంసమయ్యాయి.

# విషాదం.. చెరువులో పడి ఒకరి మృతి

**మంచిర్యాల, మార్చి 28 పెన్ పవర్:** ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బెల్లంపల్లి పరిధిలో చోటుచేసు కుంది. తాళ్లగురిజాల ఎస్ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. బెల్లంపల్లి పట్టణం లోని బూడిదగడ్డ బస్తీకి చెందిన శీలం రాజం (65) మానసిక పరిస్థితి బాగోలేక బయట తిరుగుతుంటాడు. ఈ నెల 25న ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. పోచమ్మగడ్డ చెరువు వద్ద స్నానం చేస్తుండగా ప్రమాద వశాత్తు అందులో పడిపోయి మృతి చెందాడు. బాధితుడి కొడుకు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పద్దనపల్లి పాఠశాలలో వార్షికోత్సవం, విద్యార్థులకు వీడ్కోలు

**బెల్లంపల్లి, మార్చి 28 పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ఎంపీయూపీఎస్ పద్దనపల్లి పాఠశాలలో వార్షికోత్సవం మరియు ఏడవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించగా, వారి భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. జాతీయ ఉపకారవేతన విజేతలను సత్కరించి, దాని ప్రాధాన్యతను వివరించి, విద్యార్థులను సన్నద్ధం కావాలని కోరారు.

# మెడికల్ బోర్డు నిర్వహించాలని నిరసన

**చెన్నూరు, మార్చి 28 పెన్ పవర్:** సింగరేణిలో వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శనివారం బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని గని ఆవరణలో కార్మికులు నిరసన తెలిపారు. గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హాకు వినతిపత్రం సమర్పించారు. గత కొన్ని నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆసిఫాబాద్ పురపాలక సంఘంలో ప్రత్యేక శుభ్రత డ్రైవ్

**ఆసిఫాబాద్, మార్చి 28 పెన్ పవర్:** ఆసిఫాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో వార్డు నం. 16లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. మహిళలకు తడి, పొడి, హానికర చెత్త నిర్వహణ, హోమ్ కంపోస్టింగ్ పై అవగాహన కల్పించారు. దోమల నివారణకు మందు స్ప్రే చేసి, బ్లీచింగ్ చల్లారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో హౌస్ టాక్స్, నీటి పన్ను వసూళ్ల డ్రైవ్ కొనసాగుతోంది. పట్టణ ప్రజలు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్, వార్డు సభ్యులు, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ లో కోతుల స్వైరవిహారం

**సిర్పూర్, మార్చి 28 పెన్ పవర్:** ఆసిఫాబాద్ పట్టణంలోని జానకాపూర్ కాలనీలో కోతుల బెడద తీవ్రమైంది. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా, చిన్నపిల్లలు, వృద్ధులపై దాడికి ప్రయత్నిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్ల పైకప్పులపై కోతులు గుంపులు గుంపులుగా చేరుతుండటంతో బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కోతులను పట్టి అడవిలో విడిచిపెట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

**కరీంనగర్, మార్చి 28 పెన్ పవర్:** గురువారం ఎస్సారెస్పీ కాలువలో గల్లంతైన మెట్పల్లి డీడీ నగర్కు చెందిన అంకుశ్ మృతదేహం శనివారం కోరుట్ల మండలం గుమ్లాపూర్ శివారులో లభ్యమైంది. పెద్దాపూర్ శివారులో యువతి లావణ్యతో కలిసి అంకుశ్ కాలువలో గల్లంతైనట్లు తెలిసింది. పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా అంకుశ్ మృతదేహం లభించింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. యువతి కోసం గాలింపు కొనసాగుతోంది.

# ఆశావర్కర్ల ముందస్తు అరెస్టు




**జగిత్యాల, మార్చి 28 పెన్ పవర్:** తమ సమస్యల పరిష్కారం కోసం శనివారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో, హైదరాబాద్కు బయలుదేరుతున్న ఆశావర్కర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారిని రూరల్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ అరెస్టులు జరిగినట్లు పోలీసులు తెలిపారు.

# పట్టణ పరిశుభ్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత

**పెద్దపల్లి, మార్చి 28 పెన్ పవర్:** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 7వ వార్డులో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ లు హాజరయ్యారు. పట్టణ పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఛైర్మన్ సూచించారు. వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొని పరిసరాలను శుభ్రపరిచారు.

# వైభవంగా శ్రీరాముని శోభాయాత్ర

**మంథని, మార్చి 28 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శ్రీరామనవమి సందర్భంగా రాత్రి శ్రీరాముడి శోభాయాత్ర అట్టహాసంగా జరిగింది. కంచరి బావి హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర, జెండా, మెయిన్ రోడ్, అమర్ నగర్ మీదుగా సాగింది. డీజే సంగీతం, జై శ్రీరామ్ నినాదాల మధ్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, యాత్రను తిలకించారు.

# రామాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు

**రామగుండం, మార్చి 28 పెన్ పవర్:** శ్రీరామనవమి పండుగ సందర్భంగా, పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని రామాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం, మంత్రి సీతారామ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రజలు, నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

# గ్యాస్ సిలిండర్ లకై బారులు తీరిన జనం



**షాద్నగర్, మార్చి 28 పెన్ పవర్:** ఒకవైపు అధికారులు గ్యాస్ కొరత లేదని చెబుతున్నా, మరోవైపు షాద్నగర్ పట్టణంలో ప్రజలు వంటింటి గ్యాస్ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గ్యాస్ కార్యాలయం వద్ద సిలిండర్ల కోసం జనాలు బారులు తీరి నిలబడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ కొరత లేదని ప్రకటనలు చేస్తున్నా, ఈ నిరీక్షణ, పడిగాపులు ఎన్నాళ్లో, ఈ బాధలు తీరేదెన్నడో అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్యాస్ కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఐటీ కంపెనీలపై 'ఏఐ టాక్స్'.. రేవంత్ ప్రభుత్వం వినూత్న నిర్ణయం..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) వల్ల భవిష్యత్తులో ఉద్యోగాలకు ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తరుణంలో, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వినూత్నమైన ఆలోచనతో ముందుకు రావడం ఐటీ రంగంలో పెను చర్చకు దారితీస్తోంది. ఆటోమేషన్ కారణంగా ఉపాధి కోల్పోయే కార్మికులు, ఉద్యోగులను ఆదుకోవడానికి కంపెనీలపై 'ఏఐ పన్ను' (ూ× ఖఇ) విధించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. సాంకేతిక పురోగతిని ఆహ్వానిస్తూనే, దాని వల్ల నష్టపోయే సామాన్యుడికి భద్రత కల్పించాలనే ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం అవుతుంది

**ఉద్యోగాల కోతకు విరుగుడు!**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టాలని యోచిస్తున్న ఈ 'ఏఐ పన్ను' ప్రధానంగా ఆటోమేషన్ ద్వారా మానవ వనరులను తగ్గించుకునే పెద్ద కంపెనీలను లక్ష్యంగా చేసుకుంటుంది.

ఏఐ సాఫ్ట్వేర్లు లేదంటే రోబోల వల్ల ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందించడానికి ఈ పన్ను ద్వారా వచ్చే ఆదాయాన్ని ఒక ప్రత్యేక నిధిగా మారుస్తారు. ఉద్యోగం కోల్పోయిన వారు కొత్త నైపుణ్యాలు నేర్చుకుని వేరే రంగాల్లో స్థిరపడటానికి ఈ నిధులను శిక్షణా కార్యక్రమాల కోసం వాడుతారు. సాంకేతికత కేవలం కంపెనీల లాభాలకే కాకుండా, సామాజిక భద్రతకు కూడా తోడ్పడాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష.

**గణాంకాలు ఏం చెబుతున్నాయి?**

ప్రస్తుతం ఐటీ, తయారీ రంగం, సేవా రంగాల్లో ఏఐ వాడకం విపరీతంగా పెరుగుతోంది.

డేటా ఎంట్రీ, కస్టమర్ సపోర్ట్ వంటి ఉద్యోగాలను ఏఐ చాట్బాట్లు భర్తీ చేస్తున్నాయి. హైదరాబాద్ ఒక అంతర్జాతీయ ఐటీ కేంద్రం కావడం వల్ల, ఇక్కడ ఏఐ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం ముందస్తుగానే ఈ 'ఏఐ పన్ను' ద్వారా ఒక రక్షణ కవచాన్ని నిర్మించాలని చూస్తోంది.

**ప్రపంచ చర్చ:** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ వంటి వారు కూడా గతంలో 'రోబో టాక్స్' ఉండాలని సూచించారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అదే దిశలో అడుగులు వేయడం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది.

**సవాళ్లపై చర్చలు!**

ఈ ఏఐ పన్ను ప్రతిపాదనపై పారిశ్రామిక వర్గాల నుండి మిశ్రమ స్పందన వచ్చే అవకాశం ఉంది. కంపెనీలపై అదనపు పన్ను భారం పడితే, కొత్త పెట్టుబడులు తగ్గే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. సాంకేతికతను ప్రోత్సహిస్తూనే, ఉపాధిని కాపాడటం అనేది ప్రభుత్వానికి ఒక పెద్ద కత్తి మీద సాము లాంటిది. అయితే, రేవంత్ రెడ్డి ఈ పన్ను విషయంలో అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకుని, ఒక సమగ్రమైన పాలసీని రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

సాంకేతిక విప్లవం అనేది మనిషి పురోగతికి చిహ్నం, కానీ అది మనిషి ప్రాథమిక అవసరమైన 'ఉపాధి'ని దెబ్బతీసినప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకోవడం అనివార్యం. తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తున్న ఈ 'ఏఐ పన్ను' విజయవంతమైతే, అది దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఒక మార్గదర్శకంగా మారుతుంది. ఏఐ వల్ల వచ్చే లాభాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజం మొత్తానికి అందేలా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం.

# మూసీ ఒడ్డున ఓంకారేశ్వరాలయం.. వచ్చే ఎన్నికలకు రెడీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** మూసీ నది ఒడ్డున ప్రఖ్యాత ఓం కారేశ్వర శివాలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకు స్థాపన చేశారు. శనివారం ఉదయం ఆయన ఈ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే.. ఇది హైదరాబాద్ కు కొంచెం దూరంగా ఉన్న రంగారెడ్డి జిల్లాలోని గండిపేట మండలంలోని మంచి రేవుల వద్ద నిర్మాణం కానుంది. ఈ ఆలయంలో చాలా ప్రత్యేకతలే ఉంటాయి. అచ్చంగా మధ్యప్రదేశ్లోని నర్మదానది తీరంలో ఉన్న ప్రపంచ ప్రఖ్యాత ఓంకారేశ్వర శివాలయాన్ని పోలిన నిర్మాణాన్నే ఇక్కడ చేపడతారు. అంతేకాదు.. మూసీ నది మధ్యంలో దాదాపు 100 అడుగుల ఎత్తయిన శివ విగ్రహాన్ని నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయాన్ని 8 ఎకరాల్లో నిర్మించనున్నారు. దీనికి పక్కనే వీరభద్ర స్వామి ఆలయం కూడా ఉంది. ఈ మొత్తం ప్రాజెక్టును మూడు దశల్లో నిర్మించనున్నారు. దీనికిగాను రాష్ట్ర ప్రభుత్వం 700 కోట్ల రూపాయల మేరకు ఖర్చు చేయనుంది. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి దగ్గర ఆధునిక గోశాలను కూడా నిర్మించనున్నా రు. సుమారు వెయ్యి గోవులకు ఇక్కడ షెల్టర్ కల్పించనున్నారు. ఇది కూడా తెలంగాణలో ఫస్ట్ టైమేనని అధికారులు చెబుతున్నారు. ఆయా కార్యక్రమాల్లో కుటుంబ సమేతంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పాల్గొనడం గమనార్హం.

**మూసీ కోసమే..**

మూసీ నది అనగానే కాలుష్య కాసారం గుర్తుకు వచ్చే రోజుల నుంచి ఇప్పుడు ఈ నదిని ప్రక్షాళన చేయడం ద్వారా జీవనదిగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగానే మూసీ నదిని బాగు చేయడం తోపాటు.. నదీ ప్రవాహానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలను కూడా తొలగిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా.. ఓం కారేశ్వర శివాలయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే.. దీని వెనుక కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువు సూచనలు ఉన్నట్టు తెలిసింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించనుంది. రెండేళ్ల కాల వ్యవధిలో అంటే.. వచ్చే ఎన్నికల నాటికి ఈ ఆలయాన్ని పూర్తి చేయనున్నారు.

## బూర్గంపాడ్ కు చేరుకున్న రాష్ట్ర గవర్నర్



**పినపాక, మార్చి 28 పెన్ పవర్:** శనివారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవానికి హాజరుకావడానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లకు సారపాకలోని ఐటిసి హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ గెస్ట్ హౌస్ నుండి రోడ్డు మార్గాన ఆలయానికి చేరుకొని రామయ్యను దర్శించుకున్నారు.

# భద్రాచలంలో చంద్రప్రభ వాహన సేవ

**భద్రాచలం, మార్చి 28 పెన్ పవర్:** భద్రాచల దివ్యక్షేత్రంలో జరుగుతున్న వసంత పక్ష ప్రయుక్త నవహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా రాత్రి శ్రీసీతారామచంద్రస్వామి వారు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వెన్నెల కాంతుల మధ్య స్వామివారి ఊరేగింపు మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు జయజయధ్వానాలతో స్వామివారికి నీరాజనాలు అర్పించారు.

# ప్రభుత్వం కారుణ్య నియామకాలు ఎత్తివేసే కుట్ర

**కొత్తగూడెం, మార్చి 28 పెన్ పవర్:** సింగరేణి సంస్థల్లో మెడికల్ బోర్డు కారుణ్య నియామకాలను ఎత్తివేసే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తోందని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపుకృష్ణ ఆరోపించారు. కొత్తగూడెం టౌన్ రామవరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు వారసత్వాన్ని రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని విమర్శించారు.

గతంలో గోల్డెన్ హ్యాండ్ షేక్ పేరుతో 20 వేల మందిని, డిస్మిస్ పేరుతో మరో పదివేల మందిని తొలగించారని ఆయన పేర్కొన్నారు.

# అన్‌స్టాపబుల్ అమరావతి - శాసనసభలో సరికొత్త చరిత్ర!

**హైదరాబాద్ పెన్ పవర్:** అమరావతి మాత్రమే ఏపీకి రాజధానిగా ఉంటుందని స్పష్టం చేస్తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా అమోదించిందని ప్రభుత్వం ప్రకటించింది. విభజన చట్టం సెక్షన్-5(2)ను సవరించాలని కోరుతూ 'ఎట్ అమరావతి' అనే పదాన్ని చేర్చాలని కోరుతూ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఏపీ చరిత్రలో నవ చరిత్రకు రాజధాని అమరావతికి భద్రత, భరోసా ఇచ్చేందుకు శనివారం సమావేశమైన శాసనసభ తీర్మానం చేసింది. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) నోటిపై చేసిన ప్రాంతాలను కూడా రాజధాని పరిధిలో తీసుకువచ్చేలా చట్ట సవరణ చేయాలని కోరుతూ శాసనసభ తీర్మానం చేసింది. సభ్యులు ఏకగ్రీవంగా చేసిన తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని ప్రభుత్వం శాసనసభ సెక్రటరీ జనరల్ ను ఆదేశించింది.

అదేవిధంగా అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రాజ్యసభ ఛైర్మన్, లోక్ సభ స్పీకర్ కు అసెంబ్లీ తీర్మానాన్ని పంపుతున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సభలో ప్రకటించారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసేందుకు కేంద్ర హోం మంత్రి కార్యాలయానికి తీర్మానం కాపీని పంపుతున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. స్పీకర్ సూచనలతో తీర్మానం కాపీలను కేంద్ర హోం కార్యదర్శి, ఏపీ సీఎస్ కు పంపిన అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పంపించారు.



ఇక రాజధాని అమరావతికి చట్టబద్ధత కోసం తీర్మానం చేయాలనే ఏకైక అజెండాతో సమావేశమైన శాసనసభ ఐదు గంటలకు పైగా సుదీర్ఘంగా సాగింది. ఎలాంటి విరామం లేకుండా కొనసాగిన సభలో కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు తీవ్ర భావోద్వేగంతో ఆవేశంగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, పయ్యవుల కేశవ్ అమరావతిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో అమరావతి అంశమై చోటుచేసుకున్న అనేక ఘటనలను సభలో ప్రస్తావించారు.

నేటి తీర్మానంతో రాజధాని రైతుల రుణం తీర్చుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక అధికారికంగా ఎలాంటి అవాంతరాలు లేకుండా అమరావతి రాజధానిగా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# అమరావతిపై జగన్ మౌనం.. వ్యూహాత్మిక తప్పిదమా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ రాజకీయాలను 'రాజధాని' సెంట్రిక్ పాలిటిక్స్ హీటెక్కిస్తున్నాయి. అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక తీర్మానం కోసం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైన వేళ ప్రతిపక్షం వైసీపీ గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. గతంలో మూడు రాజధానులను ప్రతిపాదించిన వైసీపీ ఇప్పుడు అమరావతికి వ్యతిరేకం కాదని చెప్పడంలో గందరగోళం ఎదుర్కొంటోందా? అన్న చర్చకు కేంద్ర బిందువుగా మారింది. ప్రత్యేక సందర్భంలో విపక్ష నేత జగన్ తోపాటు మిగిలిన ఎమ్మెల్యేలు పత్తా లేకుండా పోయారని అధికారపక్షం విమర్శలు గుప్పిస్తోంది. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అమరావతి తీర్మానంపై చర్చ జరుగుతుంటే, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ సభలో కనిపించకపోవడాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దగ్గర నుంచి కూటమి ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. రాజధానిపై వైసీపీకి చిత్తశుద్ధి లేదని ఈ రోజు మరోసారి స్పష్టమైందని విమర్శిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి కీలక అంశాలపై ప్రతిపక్షం తన వాదనను బలంగా వినిపించాల్సి ఉంటుందని అంటున్నారు. కానీ, సభకు రాకపోవడం ద్వారా వైసీపీ తన వైఖరిని స్పష్టం చేయడంలో వెనకబడిందని వ్యాఖ్యానిస్తున్నారు.

**సజ్జల క్లారిటీ.. జగన్ మౌనం!**

"మేము అమరావతికి వ్యతిరేకం కాదు" అని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పలు సందర్భాల్లో స్పష్టం చేశారు. అయితే అదే పార్టీ స్టాండ్ అయినప్పుడు, నేరుగా అసెంబ్లీలో తీర్మానానికి మద్దతు తెలపడమో లేదా తమ అభ్యంతరాలను చెప్పడమో చేస్తే వైసీపీ రాజకీయంగా సరైన వ్యూహం అనుసరించినట్లు అయ్యేదని అంటున్నారు. కానీ, సభకు గైర్హాజరు కావడమే విమర్శలకు తావిస్తోందని



అంటున్నారు. కనీసం జగన్ మీడియా ముందుకు వచ్చి తన అంతరంగాన్ని బయటపెట్టినా బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అంటున్నారు.

**జగన్ మదిలో ఏముంది?**

ప్రస్తుత పరిణామాలను చూస్తుంటే కొన్ని కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇప్పటికీ మూడు రాజధానుల వైఖరికే మొగ్గు? చూపుతున్నారా? అన్న ప్రశ్నకు ఆస్కారమిస్తున్నారని అంటున్నారు. వైసీపీ అసెంబ్లీకి హాజరుకాకపోవడంతో అమరావతికి చట్టబద్ధత కల్పించే క్రెడిట్ మొత్తం కూటమి ప్రభుత్వానికి దక్కిందని వ్యాఖ్యానిస్తున్నారు. అసెంబ్లీకి రాకుండా వైసీపీ మౌనంగా ఉండటం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉందని పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రి అచ్చెన్నాయుడు పవర్ ఫుల్ స్పీచ్.. రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్



**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీలో అమరావతిపై తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా జరుగుతున్న చర్చ ఆసక్తికరంగా సాగుతోంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సభ టీ, కాఫీ బ్రేకులు లేకుండా, భోజన విరామం కూడా ఇవ్వకుండా నిరాంటకంగా కొనసాగుతోంది. సభలో తీర్మానానికి మద్దతుగా మాట్లాడిన ఎమ్మెల్యేలు, మంత్రులు గత ప్రభుత్వంలో అమరావతిపై అనుసరించిన విధానాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ సందర్భంగా సీనియర్ నేత, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆవేశంగా మాట్లాడారు. మంత్రి ప్రసంగంలో రెండు అన్ పార్లమెంట్ పదాలను వాడారని, వాటిని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. అమరావతిపై తీర్మానాన్ని సమర్థిస్తూ మంత్రి అచ్చెన్నాయుడు బలమైన వాదన వినిపించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి నిప్పులు చెరిగారు. అప్పట్లో తాము ప్రతిపక్ష స్థానంలో ఉన్నామని, అప్పుడు అధికార పక్షంలో ఉన్న వైసీపీ సభ్యులు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో అనరాని మాటలు ఆడారని, వారి తిట్లు విని ఎందుకు రాజకీయాల్లో కొనసాగుతున్నామని బాధపడ్డామని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. కోడి పిల్లలను మార్చినట్లు మొదటి నుంచి ఏపీ రాజధానులు మారుతూ వచ్చాయని అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. 1953లో కర్నూలు, 1956లో హైదరాబాద్ రాజధానులుగా చేశారని, 2014లో మనకు ఇష్టం లేకపోయినా ఏపీని మళ్లీ విడగొట్టారని అచ్చెన్నాయుడు గతాన్ని గుర్తు చేశారు. ఈ సమయంలో 2019లో వైసీపీ ప్రభుత్వం కొలువుదీరడాన్ని అచ్చెన్నాయుడు తీవ్రంగా ఆక్షేపించారు. 2024 వరకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ వినియోగించుకోడానికి అవకాశం ఉన్నప్పటికీ మన నేలపై నుంచే పాలన సాగాలని రాజధానిగా అమరావతిని ఎంపిక చేశామని అన్నారు. ఇక 2019లో ఎన్నికలు వచ్చాయని, ఆ సమయంలో ప్రజలు చాలా తప్పు చేశారని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, పార్టీకి సంబంధం లేదని చెబుతూ ప్రజలు 2019లో వైసీపీని గెలిపించి తప్పు చేశారని మంత్రి అన్నారు. 2019లో రెండోసారి తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే మనకు ఈ బాధలు ఉండవని, ఇప్పటికే అమరావతి పూర్తయ్యేదని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ వైసీపీ గెలవడమే తనలాంటి వారిని తీవ్రంగా బాధించిందని అచ్చెన్నాయుడు అన్నారు. 2014-19లో రాష్ట్రం స్వర్ణయుగంలో నడిచిందని, కానీ ప్రజలు ఎందుకు ఓడించారా? అని బాధపడినట్లు తెలిపారు. కానీ, తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని, లక్ష కోట్లు దోచుకుని 16 నెలలు జైలులో ఉన్నవారికి ఓటేశారని అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సమయంలో అచ్చెన్న సహనం కోల్పోయే దుర్మార్గులు అంటూ వైసీపీ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక ఇదే క్రమంలో ఆవేశంగా మాట్లాడిన అచ్చెన్నాయుడు గత ప్రభుత్వంలో వైసీపీ నేతల తిట్లు భరించలేకపోయామని వాపోయారు. దుర్మార్గులు రాష్ట్రాన్ని నాశనం చేశారంటూ ధ్వజమెత్తారు. ఒకసారి తాము ప్రతిపక్షంలో ఉండగా రాజధాని అమరావతిపై స్వల్ప కాలిక చర్చ నిర్వహించారని, మొత్తం 151 మంది ఎమ్మెల్యేలతో మాట్లాడించారని, ఒక్కరు కూడా మంచి మాట్లాడలేదని అన్నారు. ఏ ఒక్కరూ అమరావతిని ముందుకు తీసుకువెళదామని చెప్పలేదని, తమను తిట్టడం, అవినీతి ఆరోపణలు చేయడం తప్ప అమరావతి కోసం ఎవరూ మాట్లాడలేదని అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. ఈ సందర్భంలో తమను సస్పెండ్ చేసి బయటకు పంపారని, ఆ తర్వాత మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టారని అచ్చెన్నాయుడు తెలిపారు. ఇక ఆ తర్వాత తమను అసెంబ్లీలో ఎన్నో రకాలుగా అవమానించారని, తాము సభకు వెళ్లమని చెప్పినా చంద్రబాబు ఒప్పుకోలేదన్నారు. ఇదే సమయంలో శాసనమండలిలో లైట్లు ఆపేసి రాజధానిపై చర్చ నిర్వహించారని, ఆ పెద్దల సభలో చూస్తే అనరాని మాటలు అన్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. ఆ మాటలు వింటే గన్ పట్టుకుని కాల్చేయాలని అనిపించిందని మంత్రి వ్యాఖ్యానించారు. కాగా, మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతున్నంత సేపు ఎమ్మెల్యేలు చప్పట్లతో హోరెత్తించారు. అచ్చెన్నాయుడు సుదీర్ఘ ప్రసంగం అనంతరం స్పీకర్ మాట్లాడుతూ, అచ్చెన్నాయుడు ఆవేశంలో ఒకటి రెండు అశబ్దాలు మాట్లాడారని వాటిని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

# అమరావతిపై తీర్మానం.. వైసీపీపై స్పీకర్ అయ్యన్నసంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో రాజధాని అమరావతిపై చారిత్రాత్మక తీర్మానాన్ని ప్రవేశపెట్టే ముందు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తీర్మానం ఐదున్నర కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపమని స్పీకర్ అయ్యన్న అభివర్ణించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న అనేక అంశాలను ఎండగట్టేలా స్పీకర్ విమర్శలు గుప్పించారు. కనీసం ఈ రోజైనా ఆ 11 మంది సభకు హాజరు అవుతానని ఆశించానని వ్యాఖ్యానించారు. సభకు హాజరుకాని విపక్ష వైసీపీ సభ్యులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రగతికి ఎదురయ్యే సవాళ్లను శాశ్వతంగా తొలగించేలా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడాన్ని ఒక పవిత్ర యజ్ఞంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభివర్ణంచారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. 2014లో విడిపోయిన రాష్ట్రాన్ని గట్టెక్కించే బాధ్యతను ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అప్పగించారని, ఆయన తన అపార అనుభవంతో అందరినీ సంప్రదించి, రాష్ట్రానికి కేంద్ర బిందువుగా ఉన్న అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు నిర్ణయంపై నమ్మకంతో అమరావతి రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చి సహకరించారని, 2014-19 మధ్య పనులు శరవేగంగా జరిగాయని చెప్పారు. దురదృష్టవశాత్తూ 2019లో ప్రగతి రథానికి అడ్డంకులు ఎదురయ్యాయని, 2019-24 మధ్య కనివినీ ఎరుగని రీతిలో వైపరీత్యాలతో కూడిన పాలన సాగిందని స్పీకర్ మండిపడ్డారు. ఇదే సందర్భంలో సభకు గైర్హాజరైన 11 మంది వైసీపీ సభ్యుల వైఖరిని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తప్పుబట్టారు. "కనీసం ఈ రోజైనా ఆ 11 మంది సభ్యులు సభకు వస్తారని భావించాను. అమరావతి తీర్మానాన్ని బలపరిచి, గతంలో తాము చేసిన తప్పులపై పశ్చాత్తాపం చెందుతారని ఆశించాను. కానీ చేసిన తప్పులను ధైర్యంగా ఒప్పుకునే నిజాయితీ వారికి లేదని అర్థమైంది. ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను." అంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వైసీపీ ఎమ్మెల్యేలపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం సహజమని, కానీ పరిపాలన అనేది నిరంతర ప్రక్రియ అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు హితవు పలికారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత పనులు కొనసాగిస్తూ కొత్తవి చేపట్టాలని, కానీ గత పాలకులు తమ చేతికి కొబ్బరి కాయ దొరికినట్టుగా ఇష్టానుసారం వ్యవహరించారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విధ్వంసానికి కంకణం కట్టుకోవడం వల్ల ఏపీ అభివృద్ధిలో 50 ఏళ్లు వెనక్కి వెళ్లిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులు వీధినపడి అవమానాల పాలయ్యారని గుర్తుచేశారు.

**శిలాక్షరాల్లో నిలిచిపోయేలా 'అమరావతి'**

ఇలాంటి వినాశకర పరిస్థితులు మళ్లీ రాకూడదనే ఉద్దేశంతోనే, అమరావతిని శాశ్వత రాజధానిగా శిలాక్షరాల్లో లిఖించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు దృఢ సంకల్పం వల్లే కేంద్ర ప్రభుత్వం సైతం రాష్ట్ర విభజన చట్టంలో మార్పులు తెచ్చేందుకు అంగీకరించిందని వెల్లడించారు. ఈ తీర్మానం రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొనియాడారు.

# అమరావతిపై షర్మిల ట్వీట్.. 'మళ్లీ జగన్ లాంటి వాళ్లు వస్తే..?'



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజధానిగా అమరావతి చట్టబద్ధతను పటిష్టం చేసే దిశగా అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే, విభజన చట్టంలోని కీలక హామీలను కేంద్రం నుంచి రాబట్టడంలో ప్రభుత్వం విఫమలవుతోందని విమర్శనాస్త్రాలు సంధించారు. కేంద్రం ఇచ్చేది 'ముష్టి' కాదు.. అది ఏపీ ప్రజల 'హక్కు' అంటూ షర్మిల తన ట్వీట్ లో పేర్కొన్నారు. ఇక తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై షర్మిల వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపును కొనియాడుతూనే 'మళ్లీ జగన్ లాంటి వాళ్లు వస్తే' అంటూ షర్మిల వ్యాఖ్యానించడం రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది. రాజధాని మార్పు వంటి నిర్ణయాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా సెక్షన్ 5 సవరణకు కేంద్రాన్ని కోరడం మంచి పరిణామమని షర్మిల తన ట్వీట్ లో అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగానే 'మళ్లీ ఏ జగన్ వంటి వారు వస్తే రాజధాని పరిస్థితి ఏంటన్న ముందుచూపు ఉండటం మీ విజన్ అనుకుందాం.. కానీ కేవలం గెజిట్‌లో పేరు మార్పుతోనే అమరావతి నిర్మాణం పూర్తవుతుందా?" అని ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రశ్నించారు. ప్రధానంగా 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలను ప్రస్తావిస్తూ ఆమె ఘాటైన ప్రశ్నలు వేశారు. కొత్త రాజధానిలో రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ వంటి రాజ్యాంగబద్ధమైన భవనాల నిర్మాణానికి కేంద్రమే పూర్తి నిధులు ఇవ్వాలని సెక్షన్ 94(3) స్పష్టం చేస్తోంది. దీనిపై అసెంబ్లీలో తీర్మానం ఎందుకు చేయడం లేదు? అంటూ షర్మిల తన ట్వీట్ లో నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అరకొర నిధులతో సరిపెట్టుకుందామా? లక్ష కోట్ల రూపాయల భారాన్ని ప్రజల నెత్తిపై వేస్తారా? అని ఆమె నిలదీశారు. గతంలో ప్రధాని మోదీ రాజధాని శంకుస్థాపన సమయంలో ఇచ్చిన 'చెంబుడు నీళ్లు, తట్టెడు మట్టి'నే గొప్ప ప్రసాదంగా భావిద్దామా అని షర్మిల ఎద్దేవా చేశారు.

**గెజిట్ పత్రాల సాక్షిగా.. కేంద్రానిదే బాధ్యత**

విభజన చట్టం గెజిట్ (నెం. 6, మార్చి 1, 2014) ప్రకారం, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బాధ్యత కేంద్రానిదే. ముఖ్యంగా సెక్షన్ 94(3) కింద ఆర్థిక సహాయం అందించడం కేంద్రం చట్టబద్ధమైన బాధ్యత అంటూ షర్మిల వ్యాఖ్యానించారు. అమరావతిని కేవలం కాగితాల మీద రాజధానిగా స్థిరీకరించడం కంటే, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను హక్కుగా సాధించుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రం విభజన చట్టానికి తూట్లు పొడుస్తుంటే అసెంబ్లీ వేదికగా ఎందుకు మౌనంగా ఉంటున్నారని, అప్పులు ఇప్పిస్తే చాలని రాజీ పడటం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమని ఆమె హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరపున తాము సంధిస్తున్న ఈ ప్రశ్నలకు కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ప్రపంచ యుద్ధోన్మాదంపై హర్ష్ గోయెంకా వీడియో.. చూస్తే కన్నీటి వరదే..



**హైదరాబాద్ పెన్ పవర్:** పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా పంచుకున్న ఒక వీడియో చూస్తుంటే ఎవరికైనా మనసు ద్రవించక మానదు. ఒకవైపు అత్యాధునిక క్షిపణులు, బాంబులు, యుద్ధ విమానాల కోసం దేశాలు లక్షల కోట్లు నీళ్లలా ఖర్చు చేస్తుంటే.. మరోవైపు అవే దేశాల్లో పసిపిల్లలు ఒక పూట తిండి కోసం వర్షంలో తడుస్తూ, చలికి వణుకుతూ క్యూలైన్లలో నిలబడడం ఈ శతాబ్దపు అతిపెద్ద విషాదం. 'ప్రపంచ ప్రాధాన్యతలు తప్పుగా ఉన్నాయి' అని ఆయన చేసిన వ్యాఖ్య అక్షర సత్యం. అధికారం, ఆధిపత్యం కోసం సాగే ఈ పోరాటాల్లో చివరకు బలవుతున్నది సామాన్య ప్రజలు, అమాయక బాలలే. హర్ష్ గోయెంకా లేవనెత్తిన ఈ నైతిక ప్రశ్న, ప్రపంచ దేశాల యుద్ధ పిచ్చి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

**యుద్ధానికి కోట్లు**

**ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల వ్యయం చూస్తుంటే కళ్లు బైర్లు కమ్మక తప్పదు.**

లక్షల కోట్ల ఖర్చు: రష్యా-ఉక్రెయిన్, యూస్, ఇజ్రాయెల్-ఇరాన్ వంటి దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల కోసం ప్రతిరోజూ వేల కోట్లు కాదు కాదు.. లక్షల కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. అత్యాధునిక ఆయుధాల తయారీకి పెట్టే పెట్టుబడిలో పదో వంతు ఖర్చు చేసినా ప్రపంచం నుంచి ఆకలిని శాశ్వతంగా పారద్రోలవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. హర్ష్ గోయెంకా ఆవేదన: హర్ష్ గోయెంకా ఖ (ట్విట్టర్)లో షేర్ చేసిన వీడియోలో, చిరిగిన బట్టలతో ఉన్న పిల్లలు వణుకుతూ ఆహారం కోసం ఎదురుచూడడం చూస్తుంటే.. మానవత్వం ఎటు పోతోందో అర్థం కావడం లేదు. దేశాల సరిహద్దులు పెంచుకోవాలనే తాపత్రయంలో, మనుషుల కడుపు నింపాలనే కనీస బాధ్యతను పాలకులు మర్చిపోతున్నారు.

**విధ్వంసానికే పెద్దపీట!**

మనిషి మనుగడకు కావలసినవి ఆహారం, ఆరోగ్యం, విద్య. కానీ నేడు ప్రపంచ బడ్జెట్లు గమనిస్తే రక్షణ రంగానికే అత్యధిక వాటా దక్కుతోంది.

ఆయుధాల పోటీ: ఒక దేశం మిస్సైల్ తయారు చేస్తే, దానిని అడ్డుకోవడానికి మరో దేశం యాంటీ-మిస్సైల్ సిస్టమ్ కోసం కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ విషవలయంలో పడి సంక్షేమ పథకాలు కుంటుపడుతున్నాయి.ఆకలి కేకలు: ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు సరైన పోషకాహారం లేక అలమటిస్తున్నారు. యుద్ధం వల్ల సరఫరా గొలుసు దెబ్బతిని ఆహార ధాన్యాల ధరలు ఆకాశాన్ని తాకడం వల్ల పేదరికం మరింత పెరుగుతోంది. హర్ష్ గోయెంకా గుర్తు చేసినట్లుగా, ప్రపంచ దేశాలు తమ ప్రాధాన్యతలను మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఒకరిపై ఒకరు గెలవడానికి ఆయుధాలు వాడడం కంటే, ఆకలిపై గెలవడానికి వనరులను కేటాయించాలి. దేశాల మధ్య ఉన్న విభేదాలు చర్చల ద్వారా పరిష్కరించుకోకపోతే, భవిష్యత్తు తరాలు ఆహారం లేక, కేవలం బాంబుల నీడలోనే పెరగాల్సి వస్తుంది. పారిశ్రామికవేత్తలు కూడా ఇలాంటి సామాజిక అంశాలపై స్పందించడం వల్ల పాలకుల్లో కొంతైనా మార్పు వస్తుందని ఆశిద్దాం.

## యుద్ధం ఆగలేదు.. మాపై తప్పుడు ప్రచారం వద్దు: మోడీ



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో యుద్ధం ఆగలేదని.. ప్రస్తుతం విరామం మాత్రమే ప్రకటించారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ క్రమంలో ప్రపంచ దేశాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కొన్ని కొన్ని దేశాల్లో చమురు నిల్వలు కూడా తరిగిపోయి.. సబ్సిడీలను ఎత్తేశాయన్నారు. మరికొన్ని దేశాల్లో నిత్యావసర సరుకులకు కొరత ఏర్పడి.. ప్రజలు అల్లాడే పరిస్థితి వచ్చాయని తెలిపారు. కానీ, మన దేశంలో అలాంటి పరిస్థితి రాకుండా.. పెద్ద ఎత్తున కృషి చేస్తున్నామని చెప్పారు. అయితే.. ప్రజల కోసం తాము ఇంత కష్టపడుతుంటే.. కొన్ని రాజకీయ పార్టీలు మాత్రం తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ప్రధాని మండిపడ్డారు. ఇది తగదని.. ప్రజలు వీటిని విశ్వసించవద్దని ఆయన తేల్చి చెప్పారు. గత నెల రోజులుగా జరిగిన ఇరాన్ యుద్ధం కారణంగా అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయన్నారు. దీనిలో ఏ దేశానికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. 140 కోట్ల మంది ప్రజలు ఉన్న భారత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇటు పార్లమెంటులోనూ సమస్యలపై చర్చిస్తున్నామన్న ప్రధాని.. తాము ఏమీ దాచడం లేదన్నారు. ఏం జరిగినా ప్రజలకు పలు వ్యవస్థల ద్వారా చెబుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ఒక క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్న ఆయన.. దీనిని సమర్థవంతంగా ఎదిరించేందుకు అందరూ ఐక్యంగా ముందుకు సాగాల్సి ఉందన్నారు. కానీ.. కొందరు రాజకీయాలే పరమావధిగా వ్యవహరిస్తున్నారని పరోక్షంగా కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ప్రధాన మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా దేశంలోనే రెండో అతి పెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జేవేరులో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. యుద్ధం సహా..ప్రస్తుతం దేశంలో నెలకొన్న అంశాలపై ఆయన ప్రసంగిస్తూ.. ఎల్పీజీ సిలిండర్ల సరఫరా త్వరలోనే సాధారణ స్థితికి చేరుతుందన్నారు. ఇంధన ధరలను అన్ని దేశాలు పెంచాయని.. కానీ, మన దేశంలో పైసా కూడా పెరగకుండా చూస్తున్నామని వ్యాఖ్యానించారు.

## అమెరికా రక్షణ కవచంలో భారీ రంధ్రం!.. ఎఫ్‌బీఐ చీఫ్ రహస్య సందేశాలను దొంగలించిన ఇరాన్ హ్యాకర్లు..




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నిఘా సంస్థగా పేరున్న ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్ స్థాయి వ్యక్తి వ్యక్తిగత ఈమెయిల్ హ్యాక్ అవ్వడం అంటే అది అమెరికా భద్రతా వ్యవస్థకే ఒక పెను సవాల్. సాధారణంగా ఇతరుల గుట్టు కనిపెట్టే ఎఫ్‌బీఐ చీఫ్ కాష్ పటేల్ సొంత ఈమెయిల్ ఇన్ బాక్స్‌నే ఇరాన్ హ్యాకర్లు రచ్చకీడ్చడం ఇప్పుడు ఇంటర్నెట్ లో పెను సంచలనం సృష్టిస్తోంది. సైబర్ సెక్యూరిటీ విషయంలో అమెరికాను ఒక 'జోక్'లా మారుస్తామని సవాల్ చేసిన హ్యాకర్లు, అన్నంత పనీ చేసి చూపించడం గమనార్హం.

**ఎఫ్‌బీఐ డైరెక్టర్ ఈమెయిల్ గల్లంతు**

ప్రస్తుత ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ వ్యక్తిగత జీమెయిల్ ఖాతాను ఇరాన్ కు చెందిన హ్యాకర్ల బృందం విజయవంతంగా హ్యాక్ చేసినట్లు ప్రకటించింది. ఇది కేవలం ఒక ప్రకటనకే పరిమితం కాలేదు, ఆయన ఇన్ బాక్స్‌లో ఉన్న ఫోటోలు, అత్యంత రహస్య పత్రాలను వారు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. అమెరికాలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ అధిపతికే రక్షణ లేకపోతే, సామాన్యుల పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమవుతోంది.

**బట్టబయలైన వ్యక్తిగత జీవితం**

ఈ హ్యాకింగ్‌లో హ్యాకర్లు కేవలం అధికారిక విషయాలే కాకుండా, కాష్ పటేల్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రతి అంశాన్ని బయటపెట్టారు. ఆయనకు భారతదేశంలో ఉన్న నివాసం, కుటుంబ వివరాలు, ప్రయాణ చరిత్ర వంటి సున్నితమైన సమాచారాన్ని హ్యాకర్లు బహిర్గతం చేశారు. ఆయన వ్యక్తిగత వ్యాపార లావాదేవీలు, ఆర్థిక డేటాను కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రపంచంలోనే మోస్ట్ పవర్‌ఫుల్ ఆఫీసర్ ఈమెయిల్‌ను హ్యాకర్లు ఒక ఆట ఆడుకోవడంపై ఇప్పుడు మీమ్స్, ట్రోల్స్ విపరీతంగా వస్తున్నాయి.

**అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ ధృవీకరణ**

ఈ హ్యాకింగ్ వార్తలను అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (ఐూజీ) అధికారికంగా ధృవీకరించడం ఈ ఉదంతం తీవ్రతను తెలియజేస్తోంది. ఒక దేశపు అత్యున్నత స్థాయి అధికారి వ్యక్తి గత సమాచారం విదేశీ హ్యాకర్ల చేతుల్లోకి వెళ్లడం అంటే అది జాతీయ భద్రతకు పెను ముప్పు. హ్యాకర్లు ఇప్పటికే దీనిని ఒక ఆరంభం మాత్రమేనని, అమెరికా సైబర్ భద్రతను అభాసుపాలు చేస్తామని హెచ్చరించడం భవిష్యత్తులో మరిన్ని దాడులకు సూచనగా కనిపిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా, హ్యాకర్ల వ్యూహాలు అంతకంటే వేగంగా మారుతున్నాయని ఈ ఘటన నిరూపిస్తోంది. కాష్ పటేల్ వంటి కీలక వ్యక్తులు వ్యక్తి గత మెయిల్స్ వాడేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఉదంతం ఒక గుణపాఠం. ఇరాన్ హ్యాకర్ల తదుపరి లక్ష్యం ఎవరనేది ఇప్పుడు అమెరికా యంత్రాంగాన్ని కలవరపెడుతోంది. సైబర్ యుద్ధం అనేది తుపాకీ గుండ్ల కంటే వేగంగా ఒక దేశపు పరువును తీయగలదని ఈ హ్యాకింగ్ స్పష్టం చేసింది.

## ఇకపై ఫేక్ రేటింగ్స్ ఆటలు సాగవు.. కేంద్రం తీసుకువచ్చిన కొత్త రూల్స్ ఇవే..




**హైదరాబాద్ పెన్ పవర్:** టెలివిజన్ (టీవీ) ఇండస్ట్రీలో ఏ ఛానల్ నంబర్ వన్, ఏ ప్రోగ్రామ్‌కు ఎక్కువ ఆదరణ ఉందనేది నిర్ణయించే 'టీఆర్పీ' (ఐ౨ా) రేటింగ్స్ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ మార్పులు ఒక పెద్ద సంచలనమే. 2014 నాటి పాత నిబంధనలను పక్కన పెట్టి, 2026 నాటి డిజిటల్ యుగానికి తగ్గట్లుగా 'టీవీ రేటింగ్స్ పాలసీ 2026'ని ప్రవేశపెట్టడం ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశారు. కేవలం కొన్ని సంస్థల గుత్తాధిపత్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, రేటింగ్స్ ఇచ్చే విధానంలో కచ్చితత్వాన్ని పెంచడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశ్యం. కేంద్రం ప్రకటించిన ఈ కొత్త మార్గదర్శకాలు, అవి టీవీ రంగంపై చూపే ప్రభావం చూస్తే..

**గుత్తాధిపత్యానికి చెక్**

ఇప్పటి వరకు టీవీ రేటింగ్స్ రంగంలో కొన్ని పెద్ద సంస్థల హవా మాత్రమే నడిచేది. దానికి ప్రధాన కారణం ఏజెన్సీ ప్రారంభించాలంటే ఉండాల్సిన భారీ ఆర్థిక నిబంధనలు.

నెట్ వర్త్ తగ్గింపు: గతంలో రూ. 20 కోట్ల నికర విలువ ఉండాలనే నిబంధనను కేంద్రం ఇప్పుడు రూ. 5 కోట్లకు తగ్గించింది. దీనివల్ల కొత్త, చిన్న స్టార్టప్‌లు రేటింగ్ ఏజెన్సీలుగా రంగంలోకి రావచ్చు. పోటీ పెరిగితే డేటా నాణ్యత కూడా పెరుగుతుంది.

**స్వతంత్ర బోర్డు:** ఏజెన్సీ బోర్డులో 50 శాతం మంది సభ్యులు బ్రాడ్‌కాస్టర్లు లేదా అడ్వర్టైజర్లతో సంబంధం లేని స్వతంత్ర వ్యక్తులై ఉండాలి. ఇది రేటింగ్స్‌లో పక్షపాతాన్ని తగ్గిస్తుంది.

**పెరిగిన శ్యాంపిల్ సైజు - కచ్చితమైన డేటా!**

కొద్దిపాటి ఇళ్లలో మీటర్లు పెట్టి మొత్తం దేశం మూడ్‌ను అంచనా వేయడం వల్ల రేటింగ్స్ తారుమారవుతున్నాయనే విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలు 6 నెలల్లోగా తమ మీటర్ల సంఖ్యను 80,000కి, భవిష్యత్తులో 1,20,000కి పెంచాల్సి ఉంటుంది. కేవలం నగరాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా సమానంగా డేటా సేకరించేలా శ్యాంప్లింగ్ విధానాన్ని మార్చారు. దీనివల్ల గ్రామీణ ప్రేక్షకుల నాడిని ఛానళ్లు సరిగ్గా పట్టుకోగలవు. కేబుల్, డీటీహెచ్‌తో పాటు ఓటీటీ (ఐు), స్మార్ట్ టీవీల వీక్షణ డేటాను కూడా పరిగణనలోకి తీసుకోవడం ఈ పాలసీలోని అత్యంత ఆధునిక అంశం.

**అక్రమాలకు తావులేని 'డబుల్ ఆడిట్' వ్యవస్థ!**

రేటింగ్స్ మానిప్యులేషన్ (రేటింగ్స్ మార్చడం) జరగకుండా ప్రభుత్వం కఠిన నిబంధనలు తెచ్చింది. త్రైమాసిక అంతర్గత ఆడిట్లు, వార్షిక బాహ్య ఆడిట్లు తప్పనిసరి చేశారు. మంత్రిత్వ శాఖ తరఫున 'ఆడిట్ అండ్ ఓవర్‌సైట్ టీమ్' అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహిస్తుంది. ఏవైనా అక్రమాలు తేలితే జరిమానాతో పాటు లైసెన్స్ రద్దు చేసే అధికారం ప్రభుత్వం వద్ద ఉంటుంది. వీక్షకుల వ్యక్తి గత సమాచారాన్ని కాపాడేందుకు 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్, 2023'ను అమలు చేయాలని ఆదేశించారు.

కేంద్రం తీసుకొచ్చిన ఈ కొత్త పాలసీ వల్ల అడ్వర్టైజర్లకు తమ ప్రకటనలు ఎక్కడ ఇవ్వాలో స్పష్టత వస్తుంది, ఛానళ్లకు తమ అసలు బలం ఎంతో తెలుస్తుంది. రేటింగ్ ఏజెన్సీలు తమ వెబ్‌సైట్లలో డేటా సేకరణ పద్ధతులను బహిర్గతం చేయాల్సి ఉండటం వల్ల వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం ద్వారా భవిష్యత్తులో టీవీ రేటింగ్స్ మరింత శాస్త్రీయంగా మారనున్నాయి. ఇది నిజంగా టీవీ పరిశ్రమలో ఒక నవశకానికి ఆరంభం.

## మొజ్తబా కూడా చనిపోయాడు: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం చేస్తున్న అమెరికా.. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీని గత నెల 28నే దాడులతో చంపేసిన విషయం తెలిసిందే. ఇక, ఆ తర్వాత.. కీలక నాయకులు సహా.. దేశాన్ని నడిపించే సైనిక నేతలు కూడా అమెరికా-ఇజ్రాయెల్ దాడులతో కన్నుమూశారు. ఇక, ఇరాన్‌కు కొత్త నాయకుడు ఎవరు అన్న ప్రశ్న తెరమీదికి వచ్చినప్పుడు.. అయతొల్లా ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా పేరు బయటకు వచ్చింది.ఆయన అధికార పగ్గాలు తీసుకున్నారని.. పాలన సాగిస్తున్నారని ఇరాన్ చెబుతున్నా.. ఆయన ఎక్కడా బయటకు రాలేదు. అధికారికంగా కూడా ఏ కార్యక్రమంలోనూ పాల్గొనలేదు. అంతేకాదు.. ఆయన పేరు, సంతకంతో కూడిన ప్రకటన కూడా వెలుగు చూడలేదు. దీంతో ప్రపంచం యావత్తు మొజ్తబా ఖమేనీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. అయితే.. ఈ వ్యవహారంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఇటీవల కీలక ప్రకటన చేశారు. ఆయన తీవ్రంగా గాయపడ్డారని.. ప్రస్తుతం కోమాలో ఉన్నారని చెప్పారు.

అంతర్జాతీయ మీడియా కూడా ఖమేనీ గాయపడ్డారని.. బ్రిటన్‌లో చికిత్స తీసుకుంటున్నారని చెప్పాయి. అయితే.. ఇరాన్ మాత్రం ఈ విషయంలో ఆచి తూచి వ్యవహరించింది. తామంతా.. మొజ్తబా ఖమేనీ నాయకత్వంలోనే పనిచేస్తున్నామన్నామని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. ఇలా.. మొజ్తబా ఖమేనీ వ్యవహారంపై అనేక సందేహాలు.. నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో అనూహ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు.

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ చనిపోయారని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ ప్రభుత్వం ఈ విషయాన్ని దాచిపెడుతోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. గత నెల 28న జరిపిన దాడుల్లోనే మొజ్తబా తీవ్రంగా గాయపడ్డారని.. ఇటీవలే ఆయన కన్నుమూశారని (హీ డెడ్ రీసెంట్లీ) అని తెలిపారు. దీంతో ఇరాన్ ప్రస్తుతం తీవ్రమైన నాయకత్వ సంక్షోభంలో ఉందన్నారు.

అంతేకాదు., అక్కడి ప్రజలు మార్పును కోరుకుంటున్నారని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అయితే.. దీనికి కూడా ఆయన ఆధారాలు చూపించలేదు. కానీ, ట్రంప్ వంటి నాయకుడు ప్రకటించారంటే అది వాస్తవమే అయి ఉంటుందని అమెరికా మీడియా పేర్కొంటోంది. ఇరాన్ దీనిపై ఇంకా మౌనం వీడలేదు.

# కరిగిపోతున్న విదేశీ మారకం నిల్వలు

దేశ ఆర్థిక వ్యవస్థకు, అంతర్జాతీయ వాణిజ్య చెల్లింపులకు అత్యంత కీలకమైన విదేశీ మారక నిల్వలు అమాంతం కరిగిపోతున్నాయి. ఆర్‌బిఐ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి 20తో ముగిసిన వారం రోజుల్లోనే ఏకంగా 11.413 బిలియన్ డాలర్ల (రూ.1 లక్ష కోట్ల పైగా) నిల్వలు కరిగిపోయి 698.346 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం వారంలోనూ 7.052 బిలియన్లు హరించుకుపోయి 709.759 బిలియన్లుగా నమోదయ్యాయి. ఫిబ్రవరి 27 నాటికి 728.498 బిలియన్ డాలర్లతో ఆల్‌టైం గరిష్టానికి చేరిన నిల్వలు పశ్చిమాసియాలోని యుద్ధంతో అమాంతం పడిపోతున్నాయి. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దాదాపు 18 బిలియన్ డాలర్లకు పైగా నిల్వలు తగ్గిపోవడంతో దేశ దిగుమతి సామర్థ్యంపై, అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనుంది. ఊహించని రీతిలో వరుసగా పతనం కావడం ఆర్థిక నిపుణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మారకం నిల్వల్లో ప్రధానమైన ఫారిన్ కరెన్సీ ఆస్తులు మార్చి 20తో ముగిసిన వారంలో 2.127 బిలియన్ డాలర్లు క్షీణించి 557.695 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. బంగారం నిల్వలు 13,495 బిలియన్ డాలర్లు తగ్గి 117.186 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద ఉన్న స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 65 మిలియన్ డాలర్లు తగ్గి 18.632 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఐఎంఎఫ్ వద్ద భారత రిజర్వ్ స్థాయిలు మాత్రం 19 మిలియన్ డాలర్లు పెరిగి 4.833 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ భారీ పతనానికి ప్రధానంగా బంగారు నిల్వల విలువలో వచ్చిన 13.495 బిలియన్ డాలర్ల భారీ కోత కారణమని రిజర్వ్ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి. ఒకవైపు పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు మండిపోతుంటే, మరోవైపు మన వద్ద ఉన్న నిల్వలు ఇలా వేగంగా




తగ్గిపోవడం రూపాయి విలువను మరింత పాతాళానికి నెట్టే ప్రమాదం ఉంది. ఇప్పటికే డాలర్‌తో రూపాయి 95 చేరువలో ఆల్‌టైమ్ కనిష్టానికి పడిపోగా.. రూపాయిని కాపాడుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న అస్త్రాలు తగ్గిపోతున్నాయనే సంకేతాలు ఈ గణాంకాలు ఇస్తున్నాయి. విదేశీ మారకం నిల్వల క్షీణత పరిస్థితి కొనసాగితే దిగుమతుల వ్యయం పెరిగి, దేశంలో నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరే అవకాశం ఉంది. విదేశీ నిల్వలలో వేగవంతమైన పతనం గనుక అదుపులోకి రాకపోతే రాబోయే రోజుల్లో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# 2026-27 ప్రథమార్ధంలో రూ.8.20 లక్షల కోట్ల ప్రభుత్వ రుణాలు



ఆదాయ లోటును భర్తీ చేసేందుకు 2026–27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబరులో డేటెడ్ సెక్యూరిటీల ద్వారా రూ.8 లక్షల కోట్లు సమీకరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఆర్థిక శాఖ శుక్రవారం తెలిపింది. 2026–27 బడ్జెట్ అంచనాల ప్రకారం స్థూల మార్కెట్ రుణాలు రూ.17.20 లక్షల కోట్లుగా ఉండాలి. బడ్జెట్ సమర్పణ తర్వాత జీ–సెక్‌ల మార్పుల కారణంగా, స్థూల మార్కెట్ రుణాలు రూ.16.09 లక్షల కోట్లకు తగ్గాయి. ఈ రూ.16.09 లక్షల కోట్లలో రూ.8.20 లక్షల కోట్లను (51%) ప్రథమార్ధంలో డేటెడ్ సెక్యూరిటీల జారీ ద్వారా సమీకరించనున్నారు. ఇందులో రూ.15,000 కోట్ల విలువైన సార్వభౌమ హరిత బాండ్లు కూడా ఉంటాయి. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతంగా ఉంచేందుకు, రూ.17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోనున్నట్లు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వాస్తవ గణాంకాల ప్రకారం.. 2026–27లో ద్రవ్యలోటు రూ.16.9 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశారు. డేటెడ్ సెక్యూరిటీల ద్వారా, నికర మార్కెట్ రుణాలు రూ.11.7 లక్షల కోట్లుగా ఉండొచ్చని భావించారు. మిగిలిన నిధులు చిన్న మొత్తాల పొదుపు పథకాలు, ఇతర వనరుల నుంచి వస్తాయని అంచనా.

# వాట్సప్‌లో డ్యూయల్ అకౌంట్ సదుపాయం

మెటాకు చెందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్, పలు కొత్త ఫీచర్లను శుక్రవారం ప్రకటించింది. ఇకపై ఐఫోన్ వినియోగదారులు ఒక ఫోన్‌లో, ఒకేసారి రెండు వాట్సప్ ఖాతాలు నిర్వహించుకోవచ్చు. దీంతో పాటు ఫోటో ఎడిటింగ్, మెసేజ్ డ్రాఫ్టింగ్ కోసం కొత్త కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్‌నూ సంస్థ తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారులకే 'టూ అకౌంట్స్, వన్ ఫోన్' ఫీచర్ అందుబాటులో ఉండగా.. ఇప్పుడు ఐఓఎస్ ప్లాట్‌ఫాం పైనా అందుబాటులోకి రానుంది. వ్యక్తిగత, వృత్తిపర సంభాషణలను నిర్వహించడానికి వినియోగదారులు రెండు వేర్వేరు ఫోన్లు వినియోగించాల్సిన అవసరం ఇకపై ఉండదని వాట్సప్ తమ బ్లాగ్‌లో పేర్కొంది. యాప్ కింద భాగంలో కనిపించే ప్రొఫైల్ పిక్చర్ ద్వారా ప్రస్తుతం ఏ ఖాతా యాక్టివ్‌గా ఉందో వినియోగదారులు గుర్తించొచ్చు. జనరేటివ్ ఏఐ ట్రెండ్‌కు అనుగుణంగా, వాట్సప్ నేరుగా చాట్‌లలో 'మెటా ఏఐ'ను అనుసంధానిస్తోంది. వినియోగదారులు ఇకపై మెటా ఏఐ ఉపయోగించి ఫోటోలను టచ్–అప్ చేయడం, అనవసరమైన అంశాలను తొలగించడం, బ్యాక్‌గ్రౌండ్ మార్చడం లేదా ఫోటో పంపే ముందు వివిధ స్టైల్స్ వాడటం వంటివి చేయొచ్చు. సంభాషణ సందర్భాన్ని బట్టి సమాధానాలను 'ఏఐ రైటింగ్ హెల్ప్' ఫీచర్ సూచిస్తుంది. ఏఐ టూల్స్ వల్ల భద్రతాపరమైన




ఆందోళనలు తలెత్తవని, వినియోగదారుల చాట్‌లు పూర్తి 'ప్రైవేట్'గా ఉంటాయని వాట్సప్ స్పష్టం చేసింది. మెటా ఏఐ కొత్త ఫీచర్లు వినియోగదారులందరికీ వెంటనే అందుబాటులోకి రాకపోవచ్చని కంపెనీ తెలిపింది.

# హర్మ్యూజ్ జలసంధిలో తగ్గని ఉద్రిక్తతలు..

## రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు రెట్టింపు

అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా భారత్ తన వ్యూహాన్ని మార్చింది. అమెరికా–ఇరాన్ యుద్ధం కారణంగా చమురు సరఫరాకు ఆటంకాలు కలగడంతో భారత్ మళ్లీ రష్యా వైపు మొగ్గు చూపుతోంది. జనవరి నెలతో పోలిస్తే రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు ఏకంగా రెట్టింపు అయ్యే అవకాశం ఉందని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో భారత్ మొత్తం ముడి చమురు దిగుమతుల్లో రష్యా వాటా 40 శాతానికి చేరుకోనుంది. సాధారణంగా భారత్ తన చమురు అవసరాల కోసం ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈలపై ఎక్కువగా ఆధారపడుతుంది. అయితే, హర్మ్యూజ్ జలసంధి గుండా రవాణా కష్టతరం కావడంతో రష్యా నుంచి తక్కువ ధరకే లభించే చమురు భారత్‌కు ఊరటనిస్తోంది. అయితే, గతంలో రష్యన్ చమురుపై ఆంక్షలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయంగా చమురు ధరలను కంట్రోల్ చేసేందుకు ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 30 రోజుల పాటు మినహాయింపువ్వగా అది భారత్‌కు పూర్తిగా కలిసొచ్చింది. మార్చి 19న భారత పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, రష్యా డిప్యూటీ ఇంధన మంత్రి పావెల్ సోరోకిన్ మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రష్యా నుంచి కేవలం ముడి చమురు మాత్రమే కాకుండా, నేరుగా ఎల్ఎన్‌జీ విక్రయాలను కూడా పునరుద్ధరించే దిశగా ఇరు దేశాలు అడుగులు వేస్తున్నాయి.



# భారత్‌లో నోకియా లేఆఫ్‌లు!




అంతర్జాతీయ పునర్నిర్మాణ పథకంలో భాగంగా, మనదేశంలోనూ కొందరు ఉద్యోగులకు లేఆఫ్ చేపట్టడానికి నోకియా సిద్ధమవుతోందని సమాచారం. 2026లో పునర్నిర్మాణ ప్రక్రియ చేపడతామని కంపెనీ గతేడాది నవంబరులో ప్రకటించింది. ఇందులో భాగంగా కంపెనీని నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మొబైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే రెండు విభాగాలుగా సరళీకరిస్తారు. మిగతా వ్యాపారాలన్నిటినీ పెట్టుబడుల ఉపసంహరణ లేదా సమీక్ష నిమిత్తం విడదీస్తారు. ప్రపంచవ్యాప్తంగా సంస్థకు 74,100 మంది ఉద్యోగులుండగా.. అందులో 20% వరకు కోతలుండొచ్చన్న అంచనాలున్నాయి. భారత్‌లోనూ అదే స్థాయిలో లేఆఫ్ చేయొచ్చని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల వార్తా సంస్థ ఒకటి పేర్కొంది. నోకియా ఇండియా కంట్రీ హెడ్‌గా ఉన్న తరుణ్ చాబ్రా నిష్క్రమణ నేపథ్యంలో, ఏప్రిల్ 1 నుంచి ఇండియా కంట్రీ బిజినెస్ లీడర్‌గా సమర్ మిత్తల్, ఇండియా కంట్రీ మేనేజర్‌గా విభా మెహ్రా నియమితులు కానున్నారని నోకియా సీఈఓ జస్టిన్ హోటర్డ్ ప్రకటించారు. మనదేశంలో నోకియా శాశ్వత ఉద్యోగుల సంఖ్య 2024లో 17,270 కాగా, గతేడాది 17,708కు పెరిగింది. ఈ ఏడాది మాత్రం ఉద్యోగ కోతలకు అవకాశం ఉందని అంచనా.

# రికార్డు స్థాయిలో రూపాయి పతనం



భారతీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ పడిపోతూ ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికన్ డాలర్ బలోపేతం కావడం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో రూపాయి విలువ చారిత్రక కనిష్టానికి పడిపోయింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఒక్కరోజే భారీగా క్షీణించి, ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూ.94.82 వద్దకు చేరుకుంది. గతకొన్ని రోజులుగా డాలర్‌తో పోలిస్తే 93–94 మధ్య ఊగిసలాడుతున్న రూపాయి, నేడు ఒక్కసారిగా 86 పైసల మేర పతనమై 94.82 స్థాయిని తాకింది. ఈ ఏడాది (2026) ప్రారంభం నుండి రూపాయి సుమారు 5 శాతం మేర క్షీణించడం గమనార్హం. ఇరాన్, అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయం మార్కెట్లను వెంటాడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల మార్కును దాటడం భారత్ లాంటి దిగుమతి దేశాల కరెన్సీపై ఒత్తిడి పెంచుతోంది. చమురు ధరలు పెరగడంతో మన దేశ దిగుమతి వ్యయం భారీగా పెరిగి, కరెన్సీ నిల్వలపై ప్రభావం చూపుతోంది. భారత స్టాక్ మార్కెట్ల నుండి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఈఎఫ్ఐ) తమ నిధులను వెనక్కి తీసుకోవడం కూడా రూపాయి బలహీనపడటానికి కారణమైంది. రూపాయి విలువ పడిపోవడం వల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరగనున్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ముడిచమురు, వంట నూనెల ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడిపై భారం పడే ప్రమాదం ఉంది.

# ట్రంప్ ఇరాన్‌తో చర్చలు.. బంగారం ధరల్లో వృద్ధి



అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఊహించని రీతిలో పుంజుకున్నాయి. ఆసియా వాణిజ్యమార్కెట్లో గోల్డ్ ధర ఏకంగా 2.1 శాతం పెరిగి, ఔన్స్ బంగారం 4,467.32 డాలర్ల వద్దకు చేరుకుంది. గత సెషన్‌లో దాదాపు 3 శాతం మేర భారీ పతనాన్ని చవిచూసిన పసిడి, నేడు మళ్ళీ లాభాల బాట పట్టడం విశేషం. ఈ ధరల పెరుగుదలకు ప్రధానంగా అంతర్జాతీయ యుద్ధ పరిణామాలు, అమెరికా డాలర్ విలువలో వచ్చిన మార్పులే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా అమెరికా డాలర్ ఇండెక్స్ మూడు రోజుల వరుస లాభాల తర్వాత 0.1 శాతం మేర బలహీనపడటం, పెట్టుబడిదారులు తిరిగి బంగారం వైపు మొగ్గు చూపేలా చేసింది. సాధారణంగా డాలర్ బలహీనపడినప్పుడు, ఇతర కరెన్సీలు కలిగిన దేశాలకు బంగారం కొనుగోలు చౌకగా మారుతుంది. తద్వారా డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతాయి. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో జరుపుతున్న చర్చల విషయంలో సానుకూల సంకేతాలు ఇవ్వడం కూడా బంగారం ధర పెరగడానికి కారణం అయింది. ఇరాన్ అభ్యర్థన మేరకు ఆ దేశ ఇంధన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దాడులను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. చర్చలు "చాలా బాగా" సాగుతున్నాయని ట్రంప్ పేర్కొనడం వల్ల యుద్ధ భయాలు కొంత తగ్గి, తాత్కాలిక ఉపశమనం లభించినట్లయింది. అయితే, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అనిశ్చితి వల్ల చమురు సరఫరాకు ఆటంకం ఏర్పడి, ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ భయాలు పెరిగాయి. ఈ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను దీర్ఘకాలం పాటు అధికంగానే ఉంచే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇటువంటి ఆర్థిక పరిస్థితుల్లో బంగారం సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు.

# వీటిని వాడితే అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకున్నట్టే



కొల్లాజెన్ అనేది మన శరీరంలో సహజంగా ఉత్పత్తి అయ్యే ఒక ముఖ్యమైన ప్రోటీన్. ఇది చర్మం, ఎముకలు, కీళ్ల నిర్మాణాన్ని కాపాడుతుంది. వయస్సు పెరిగే కొద్దీ దీని ఉత్పత్తి తగ్గడం వల్ల ముడతలు రావడం సహజం. దీనిని భర్తీ చేయడానికి వాడే సప్లిమెంట్లు అందరికీ సురక్షితం కాకపోవచ్చు. మెరిసే చర్మం, దృఢమైన జుట్టు, బలమైన గోర్లు.. నేటి కాలంలో ప్రతి ఒక్కరూ కోరుకునే అందం ఇది. ఈ క్రమంలో 'కొల్లాజెన్ సప్లిమెంట్లు' ఒక మ్యాజిక్ పౌడర్‌లా ప్రాచుర్యం పొందాయి. మార్కెట్లో దొరికే కొల్లాజెన్ డ్రింక్స్, క్యాప్సుల్స్ వాడితే యవ్వనంగా కనిపిస్తామని చాలామంది నమ్ముతుంటారు. అయితే, ఈ సప్లిమెంట్లు వాడే ముందు వాటి వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు పొంచి ఉన్న ఆరోగ్య ముప్పుల గురించి కూడా తెలుసుకోవడం అత్యవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీర్ణకోశ సమస్యలు– కొల్లాజెన్ పౌడర్లు లేదా పిల్స్ తీసుకున్నప్పుడు కొందరిలో కడుపు ఉబ్బరం, గుండెల్లో మంట, వికారం వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా అధిక మోతాదులో తీసుకున్నప్పుడు జీర్ణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది.అలర్జీల ముప్పు– మెరైన్ కొల్లాజెన్ (చేపల నుండి తీసేది) సీఫుడ్ అలర్జీ ఉన్నవారికి ప్రమాదకరం. దీనివల్ల చర్మంపై దద్దుర్లు, దురద, గొంతులో అసౌకర్యం వంటి లక్షణాలు కనిపిస్తాయి.భారీ లోహాల నిల్వలు– నాసిరకం బ్రాండ్లు వాడటం వల్ల సప్లిమెంట్లలో ఉండే సీసం లేదా ఇతర భారీ లోహాలు శరీరంలోకి చేరే అవకాశం ఉంది. ఇది దీర్ఘకాలంలో ఆరోగ్యానికి హానికరం. కిడ్నీలపై ఒత్తిడి– కొల్లాజెన్ తీసుకోవడం వల్ల శరీరంలో ప్రోటీన్ మోతాదు పెరుగుతుంది. ఇప్పటికే కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఈ అదనపు ప్రోటీన్ వడపోత భారం కావొచ్చు. సహజంగా కొల్లాజెన్‌ను పెంచుకోవడమే శ్రేయస్కరం. సప్లిమెంట్లపై వేల రూపాయలు ఖర్చు చేసే కంటే, మన జీవనశైలిలో చిన్న మార్పులతో సహజంగానే కొల్లాజెన్‌ను వృద్ధి చేసుకోవచ్చు. నిమ్మకాయలు, బెర్రీలు, బెల్ పెప్పర్లు కొల్లాజెన్ ఉత్పత్తికి ఇంధనంలా పనిచేస్తాయి. గుడ్లు, చేపలు, పప్పు ధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. మితిమీరిన సూర్యరశ్మి తగలకుండా చూసుకోవాలి. పొగతాగడం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి. సరైన విశ్రాంతి, క్రమబద్ధమైన వ్యాయామం శరీరంలో సహజంగానే ప్రోటీన్ల నిర్మాణాన్ని మెరుగుపరుస్తాయి. కొల్లాజెన్ సప్లిమెంట్లు వృద్ధాప్యానికి పూర్తిస్థాయి పరిష్కారం కావు. శాస్త్రీయంగా వీటి ప్రయోజనాలు అందరిలో ఒకేలా ఉండవు. కాబట్టి, సప్లిమెంట్లు ప్రారంభించే ముందు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి. సహజ ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలితోనే శాశ్వతమైన అందం, ఆరోగ్యం లభిస్తాయని గుర్తించాలి.

# వేసవిలో వడదెబ్బకు 'గోండ్ కతిరా'తో చెక్



సమ్మర్ వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. చల్లదనం కోసం ఏవేవో పదార్థాలు ట్రై చేసేస్తుంటాం. ప్రతి దానితోనూ ఏదో ఒక ప్రయోజనం ఉంటుంది. అయితే అందరికీ అన్ని పడవు. అందుకే సహజంగా లభించే పదార్థాలకు వాడటానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తుంటారు. చాలామంది సబ్జా గింజలు నానబెట్టి తాగితే మరొకొందరు వేరే వేరే పదార్థాలను వాడటానికి ఆసక్తి చూపిస్తారు. వేసవి కాలంలో ఎండలు మండిపోతున్నాయి. బాహ్య ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం పొందడానికి మనం రకరకాల శీతల పానీయాలను ఆశ్రయిస్తుంటాం. అయితే, కృత్రిమ పానీయాల కంటే సహజ సిద్ధమైన చల్లదనాన్ని ఇచ్చే గోండ్ కతిరా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీనినే 'ట్రాగాకాంత్ గమ్' అని కూడా పిలుస్తారు. మన వంటింటి మసాలా డబ్బాలో ఉండే ఈ చిన్న పదార్థం, పొట్ట ఆరోగ్యానికి ఒక అద్భుత ఔషధంగా పనిచేస్తుంది. ఆరోగ్య సంస్థల నివేదికల ప్రకారం, నేడు 80% మంది ప్రజలు అసిడిటీ లేదా గుండెల్లో మంట వంటి జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి ఆస్ట్రాగలస్ అనే మొక్క నుండి వచ్చే గోండ్ కతిరా ఒక వరప్రసాదం.సింథటిక్ కూలింగ్ డ్రింక్స్ తాత్కాలిక చల్లదనాన్ని మాత్రమే ఇస్తాయి. కానీ గోండ్ కతిరా ఒక సహజ 'ప్రీబయోటిక్'. ఇది మన జీర్ణాశయంలో ఉండే మంచి బ్యాక్టీరియా పెరగడానికి దోహదపడుతుంది. తద్వారా పేగుల ఆరోగ్యం మెరుగుపడి, రోగనిరోధక శక్తి పెరుగుతుంది.ఇందులో ఉండే కరిగే ఫైబర్ మలాన్ని మృదువుగా చేసి, మలబద్ధకం సమస్యను సులభంగా తొలగిస్తుంది.నీటిలో నానబెట్టినప్పుడు ఇది జెల్‌లా మారుతుంది. ఇది జీర్ణాశయ గోడలపై ఒక రక్షణ పొరలా ఏర్పడి, గుండెల్లో మంటను మరియు యాసిడ్ రిఫ్లక్స్‌ను తగ్గిస్తుంది.గోండ్ కతిరాలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల దీనిని తీసుకున్నప్పుడు కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల అతిగా తినడం తగ్గి, బరువు అదుపులో ఉంటుంది. అలాగే, ఇది శరీరంలో నీటిని నిల్వ ఉంచే లక్షణాన్ని కలిగి ఉండటం వల్ల డీహైడ్రేషన్, వేసవి అలసటను తగ్గిస్తుంది. నానబెట్టడం: దీనిని ఎప్పుడూ ఎండిన రూపంలో తీసుకోకూడదు. కనీసం 8 గంటలు నీటిలో నానబెట్టి, జెల్‌లా మారిన తర్వాతే పానీయాల్లో కలుపుకోవాలి.నీరు ఎక్కువగా తాగాలి: ఇది శరీరంలోని నీటిని గ్రహిస్తుంది కాబట్టి, దీనిని వాడేవారు రోజుకు 2–3 లీటర్ల నీరు తప్పనిసరిగా తాగాలి.

# తీర్థం రాగి పాత్రలోనే ఎందుకు ఇస్తారు?

మన భారతీయ సంప్రదాయాల్లో కనిపించే ఆచారాల వెనుక ఆరోగ్యం, పరిశుభ్రత, సహజ వైద్య జ్ఞానం దాగి ఉంటుంది. దేవాలయాల్లో ఇచ్చే తీర్థం (చరణామృతం) కేవలం భక్తి సూచిక మాత్రమే కాదు, ఆరోగ్యానికి ఉపయోగపడే అంశం కూడా. భక్తి, విజ్ఞానం కలిసిన అద్భుతమైన సంప్రదాయం ఇది. మన భారతీయ సంప్రదాయాల్లో చాలా ఆచారాలు పైకి సాధారణంగా కనిపించినా.. వాటి వెనుక ఆరోగ్యం, పరిశుభ్రత, సహజ వైద్య జ్ఞానం దాగి ఉండే అవకాశం ఉంది. మనందరం దేవాలయాలకు వెళ్లినప్పుడు ఇచ్చే తీర్థం లేదా చరణామృతం కేవలం భక్తి సూచిక మాత్రమే కాదు.. దాని వెనుక ఆరోగ్యపరమైన ఆలోచన కూడా దాగి ఉంది. తీర్థం కూడా అలాంటి ఒక అద్భుతమైన ఉదాహరణగా చెప్పవచ్చు. భక్తి, విజ్ఞానం కలిసిన ఒక సంప్రదాయం. ఈ విషయాన్ని కొంచెం సులభంగా, స్పష్టంగా ఇలా అర్థం చేసుకుందాం. తీర్థంలో తులసి ఆకులు వేయడం యాదృచ్ఛికం కాదు. తులసికు ఆయుర్వేదంలో ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కలిగి ఉంటుంది. జలుబు, దగ్గు, కఫం వంటి సమస్యలకు ఉపశమనం ఇవ్వగలదని నమ్మకం శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గించడంలో సహాయపడుతుందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే పూర్వ కాలంలో తీర్థంలో తులసి వేయడం ఆరోగ్య దృష్ట్యా కూడా ప్రయోజనకరంగా భావించారు. మనకు తెలిసిన కర్పూరంలో తినదగినది "పచ్చ కర్పూరం". దీన్ని చాలా స్వల్ప పరిమాణంలో తీర్థంలో కలుపుతారు. దీని సువాసన మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. జీర్ణక్రియను ప్రేరేపించడంలో సహాయపడుతుందని ఆయుర్వేదం చెబుతుంది. గొంతులో గరుకుదనం తగ్గించడంలో కూడా ఉపయోగపడొచ్చు.చాలా దేవాలయాల్లో తీర్థాన్ని రాగి పాత్రలో ఉంచడం వెనుక కూడా ఒక శాస్త్రీయ కారణం ఉంది. రాగికు సహజ యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉన్నాయి. కొన్ని రకాల బ్యాక్టీరియా రాగిపై ఎక్కువసేపు జీవించలేవు. నీటిలో స్వల్పంగా కాపర్ అయాన్లు కలవడం వల్ల నీరు కొంత శుభ్రంగా ఉండే అవకాశం ఉంది.పూర్వకాలంలో వైద్య సదుపాయాలు తక్కువగా ఉండేవి. అందుకే ప్రజలు సహజ పద్ధతులపై ఆధారపడ్డారు. తులసి ఆకులు + రాగి పాత్రలో నిల్వ చేసిన నీరు.. ఈ కలయిక ఒక సాధారణ ఆరోగ్య రక్షణ పద్ధతిగా ఉపయోగించబడిందని భావించవచ్చు. తీర్థాన్ని తాగిన తర్వాత తలకు రాసుకోవడం ఒక భక్తి సంప్రదాయం. ప్రధాన ఉద్దేశం: తీర్థాన్ని పానీయంగా స్వీకరించడం, తలకు రాసుకోవడం గురించి స్పష్టమైన శాస్త్రీయ నియమం లేదు. ఇది వ్యక్తిగత విశ్వాసం, సంప్రదాయం మీద ఆధారపడి ఉంటుంది.

# ఈ పండు స్పెషాలిటీ తెలిస్తే..



నారింజ పండులో విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి, బరువు నియంత్రణలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యం, రక్తపోటు నియంత్రణ, జీర్ణక్రియ మెరుగుదలకు తోడ్పడతాయి. క్యాన్సర్, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా నారింజ కీలక పాత్ర పోషిస్తుందని డైటీషియన్లు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి నిత్యం పండ్లను ఆహారంలో భాగం చేసుకోవడం అవసరం. సీజనల్‌గా లభించే పండ్లతో పాటు అన్ని కాలాల్లోనూ దొరికే నారింజ పండు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. నారింజ పండులో ఉండే ఔషధ గుణాలు, పోషక విలువలను గురించి తెలుసుకుంటే.. ఈ పండును అస్సలు వదలకుండా తింటారు. వాస్తవానికి నారింజ పండు అద్భుతమైన పోషకాలను కలిగి ఉంటుంది. ఇందులో విటమిన్ ఎ, బి స్వల్పంగా, విటమిన్ సి, బి1 అధిక మోతాదులో లభిస్తాయి. మానవ శరీరానికి రోజుకు అవసరమయ్యే విటమిన్ సి లో దాదాపు 70% వరకు ఒక నారింజ పండు నుంచే పొందవచ్చు. వీటితో పాటు సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, రాగి, గంధకం, క్లోరిన్లు వంటి ముఖ్యమైన ఖనిజాలు కూడా ఇందులో సమృద్ధిగా ఉంటాయి. నారింజలో సమృద్ధిగా లభించే విటమిన్ సి శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. ఇది శరీరానికి ఐరన్‌ను గ్రహించడంలో సహాయపడి, రక్తనాళాలు, కార్టిలేజ్, కండరాలు, బోన్ కొల్లాజెన్ ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతుంది. నారింజలోని ఫైబర్ త్వరగా ఆకలి కాకుండా పొట్ట నిండిన భావనను కలిగిస్తుంది.. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, నారింజలో సాల్యుబుల్ (కరిగే), ఇన్సాల్యుబుల్ (కరగని) అనే రెండు రకాల ఫైబర్‌లు ఉంటాయి. పండు పై పొరలో ఇన్సాల్యుబుల్ ఫైబర్ ఉండగా, గుజ్జులో సాల్యుబుల్ ఫైబర్ లభిస్తుంది. ఈ ఫైబర్‌లు జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. నారింజ పండు దాని నారింజ రంగు కారణంగా యాంటీఆక్సిడెంట్లు, కెరోటినాయిడ్లను సమృద్ధిగా కలిగి ఉంటుంది. ప్రతి నారింజలో 170 కంటే ఎక్కువ ఫైటోకెమికల్స్, 60 ఫ్లేవనాయిడ్లు ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇవి రోగనిరోధక లక్షణాలతో నిండి ఉంటాయి. నారింజ తినడం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం, ఆర్థరైటిస్, డిప్రెషన్, అల్జీమర్స్ వంటి సమస్యల నుంచి రక్షణ పొందవచ్చు. నారింజలో లభించే పొటాషియం గుండె సక్రమంగా పనిచేయడానికి సహాయపడుతుంది. అలాగే అధిక రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది సోడియం ప్రభావాన్ని తగ్గించి రక్తపోటును సమర్థవంతంగా అదుపులో ఉంచుతుంది. ఊబకాయంతో బాధపడేవారు రెండు నుండి మూడు నారింజ పండ్లను స్నాక్‌గా తీసుకోవడం వల్ల కడుపు నిండుగా అనిపిస్తుంది. మధుమేహులు కూడా 100 నుండి 150 గ్రాముల నారింజ పండ్లను తీసుకోవచ్చు, వీటిలో తక్కువ కేలరీలు ఉంటాయి. గర్భిణులకు అవసరమైన ఫోలిక్ యాసిడ్‌ను నారింజ నుండి పొందవచ్చు. వ్యాయామం చేసే వారికి ఎక్కువ ఆక్సిజన్ పొందడానికి ఇది ఒక ఉత్తమ పండు. నారింజలో థయామిన్ (విటమిన్ ః1) కూడా అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి పోషకాలను ప్రాసెస్ చేయడానికి, ఆహారాన్ని శక్తిగా మార్చడానికి సహాయపడుతుంది. ఇది ఋతుక్రమ సమస్యలు, నోటి దుర్వాసన, నోటి పుండ్లు వంటి వాటిని తగ్గిస్తుంది. విటమిన్ ఎ కంటి సమస్యలను దూరం చేస్తుంది. అలాగే అజీర్ణ సమస్యలను తగ్గించి ఆహారనాళంలో క్రిములను నాశనం చేయడంలో కూడా సహాయపడుతుంది. నారింజను నేరుగా పండుగా తినడం, సలాడ్‌లలో, లేదా పుడ్డింగ్‌లలో చేర్చుకోవడం వల్ల అన్ని పోషకాలు లభిస్తాయి. అయితే నారింజ రసం తీసినప్పుడు, ముఖ్యంగా దాన్ని వడగట్టినప్పుడు ఫైబర్ తొలగిపోతుంది. ఇది గ్లూకోజ్ స్థాయిలను పెంచి, కాలక్రమేణా కొవ్వు కాలేయానికి దారితీస్తుంది. మధుమేహ రోగులకు ఇది హానికరం. అయితే, ఒక సంవత్సరం కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్న పిల్లలకు, ఆహారం సరిగా తీసుకోలేని వృద్ధులకు నారింజ గుజ్జుతో సహా రసం ఇవ్వడం వల్ల వారికి ముఖ్యమైన ఫైబర్ లభించి, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. నారింజ పండు అన్ని వయసుల వారికి, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. జ్వరం, కోవిడ్ వంటి అనారోగ్యాల నుంచి కోలుకునే వారికి ఇది మంచి ఆరోగ్యకరమైన ఆహారం. నారింజ వంటి పండ్లను మన ఆహారంలో భాగం చేసుకుంటే ఎల్లప్పుడూ.. ఆరోగ్యంగా ఉండొచ్చని డైటీషియన్లు చెబుతున్నారు..

# టైప్-2 మధుమేహానికి ఫాస్ట్ ఫుడ్ కారణమా?



తెలంగాణ పట్టణాల్లో జీవనశైలి వేగంగా మారుతోంది. పని ఒత్తిళ్లు, సమయాభావం, సౌకర్యాల పెరుగుదలతో సంప్రదాయ ఆహారపు అలవాట్లు తగ్గిపోతూ.. ఫాస్ట్ ఫుడ్ వినియోగం పెరుగుతోంది. ఈ మార్పు ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. ఒక కొత్త డేటా ప్రకారం.. తెలంగాణ పట్టణ ప్రాంతాల ప్రజలు తమ నెలవారీ ఆహార వ్యయంలో 28 నుంచి 34 శాతం వరకు ఫాస్ట్ ఫుడ్‌పైనే ఖర్చు చేస్తున్నారు. దేశంలోనే అత్యధికంగా ఫాస్ట్ ఫుడ్‌పై ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. ఈ ధోరణి వల్ల టైప్–2 మధుమేహం ప్రమాదం బాగా పెరుగుతోందని అధ్యయనం స్పష్టం చేసింది. "ఫాస్ట్ ఫుడ్ అట్రిబ్యూటెడ్ డయాబెటిస్ ఇండెక్స్ స్టడీ" పేరుతో జరిగిన ఈ పరిశోధనలో ఆందోళనకర విషయాలు వెలుగుచూశాయి. భారత వైద్య పరిశోధన మండలి ఆధ్వర్యంలో, అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఈ అధ్యయనం జరిగింది. దక్షిణ రాష్ట్రాల్లో తెలంగాణే ముందంజలో ఉందని నివేదిక వెల్లడించింది. సంప్రదాయ ఆహారాల నుంచి ప్రజలు దూరమవుతూ.. అధిక కేలరీలు, కొవ్వులు, చక్కెరలతో నిండిన పారిశ్రామికంగా తయారైన ఆహారాలవైపు మళ్లుతున్నారని అధ్యయనం చెబుతోంది. ఈ మార్పు కారణంగా పట్టణాల్లో టైప్–2 మధుమేహం కేసులు క్రమంగా పెరుగుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా మహిళల్లో ప్రమాదం ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం పట్టణ పురుషుల్లో సుమారు 3.8 శాతం మంది మధుమేహంతో బాధపడుతుండగా.. మహిళల్లో ఊబకాయం శాతం మరింత ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. ఇది భవిష్యత్తులో మరిన్ని మధుమేహ కేసులకు దారితీయవచ్చని హెచ్చరికగా భావిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి కొంత భిన్నంగా ఉంది. అక్కడ ఫాస్ట్ ఫుడ్ వినియోగం తక్కువగా ఉండటంతో మధుమేహం ప్రమాదం కూడా గణనీయంగా తక్కువగా ఉందని అధ్యయనం తెలిపింది. జీవనశైలి, ఆహార అలవాట్లలో ఉన్న తేడాలే దీనికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ఆరోగ్య నిపుణుల సూచన ఏమిటంటే.. ఫాస్ట్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి, సంప్రదాయ ఆహారాలను తిరిగి అలవాటు చేసుకోవాలి. లేకపోతే? సౌకర్యాల కోసం తీసుకుంటున్న చిన్న నిర్ణయాలు భవిష్యత్తులో పెద్ద ఆరోగ్య సమస్యలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# వేసవిలో పచ్చి మామిడి కాయలు తింటే అద్భుతమైన ప్రయోజనాలు



పచ్చి మామిడి పేరు వినగానే నోరూరిపోతుంది. మామిడి పన్నా, మామిడి చట్నీ వంటి రుచికరమైన వంటకాలు దీని ద్వారా తయారు చేస్తారు. కానీ పచ్చి మామిడిలో ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు చాలా మందికి పూర్తిగా తెలియవు. వేసవి సీజన్ రాగానే మామిడి ప్రియుల ఆనందానికి హద్దులు ఉండవు. వేసవి ప్రారంభం కాగానే పచ్చి మామిడికాయలు మార్కెట్‌లో కనిపించడం మొదలవుతుంది. మామిడిని "పండ్ల రాజు"గా పిలుస్తారు. అందుకే దాని కోసం ఏడాది పొడవునా ఎదురుచూస్తారు. ముఖ్యంగా ఏప్రిల్‌లో పచ్చి మామిడికాయలు విరివిగా లభిస్తాయి. అయితే, పచ్చి మామిడి రుచి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ప్రతి కాలానికి అనుగుణంగా లభించే ఆహారాలను తినడం మన శరీరానికి చాలా అవసరం. అయితే, ఏ ఆహారమైనా పరిమితంగా తీసుకోవడం మంచిది. పచ్చి మామిడికాయలు విటమిన్ ం, విటమిన్ అ, విటమిన్ ఇ, కాల్షియం, ఐరన్, ఫైబర్, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి అనేక పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి శరీరాన్ని వేసవి వేడికి నుంచి రక్షించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వేసవి సీజన్ రాగానే మామిడి (ఓజీనిణనీబ) ప్రియుల ఆనందానికి హద్దులు ఉండవు. వేసవి ప్రారంభం కాగానే పచ్చి మామిడికాయలు మార్కెట్‌లో కనిపించడం మొదలవుతుంది. మామిడిని "పండ్ల రాజు"గా పిలుస్తారు. అందుకే దాని కోసం ఏడాది పొడవునా ఎదురుచూస్తారు. ముఖ్యంగా ఏప్రిల్‌లో పచ్చి మామిడికాయలు విరివిగా లభిస్తాయి. అయితే, పచ్చి మామిడి రుచి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ప్రతి కాలానికి అనుగుణంగా లభించే ఆహారాలను తినడం మన శరీరానికి చాలా అవసరం. అయితే, ఏ ఆహారమైనా పరిమితంగా తీసుకోవడం మంచిది. పచ్చి మామిడి పోషక విలువలు పచ్చి మామిడికాయలు విటమిన్ ం, విటమిన్ అ, విటమిన్ ఇ, కాల్షియం, ఐరన్, ఫైబర్, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి అనేక పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి శరీరాన్ని వేసవి వేడికి నుంచి రక్షించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి.పచ్చి మామిడి శరీరంలో నీటి లోటును పూడ్చడంలో సహాయపడుతుంది. వడదెబ్బ నుంచి రక్షించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం, ఎసిడిటీ వంటి సమస్యలను తగ్గిస్తుంది. 3. రోగనిరోధక శక్తి పెంపు.. విటమిన్ అ సమృద్ధిగా ఉండడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. వేసవిలో వచ్చే వ్యాధులను దూరం చేస్తుంది. 4. బరువు నియంత్రణ.. పండిన మామిడితో పోలిస్తే పచ్చి మామిడిలో చక్కెర, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది మెటాబాలిజాన్ని పెంచి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. కాలేయాన్ని శు భ్రపరచడంలో సహాయపడుతుంది. అలాగే చిగుళ్ల నుంచి రక్తస్రావం, నోటి దుర్వాసన వంటి సమస్యలను తగ్గిస్తుంది. పచ్చి మామిడికాయలు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ, వాటిని పరిమితంగా మాత్రమే తినాలి. ఎక్కువగా తింటే కడుపు నొప్పి, గొంతు నొప్పి వంటి సమస్యలు రావచ్చు. నెయ్యి లేదా కొద్దిగా ఉప్పుతో తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుంది. మొత్తంగా, పచ్చి మామిడి వేసవిలో శరీరానికి సహజమైన శక్తిని అందించే ఒక అద్భుతమైన ఆహారం. 5. కాలేయం, దంతాల ఆరోగ్యం.. కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. అలాగే చిగుళ్ల నుంచి రక్తస్రావం, నోటి దుర్వాసన వంటి సమస్యలను తగ్గిస్తుంది. జాగ్రత్తలు: పచ్చి మామిడికాయలు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ, వాటిని పరిమితంగా మాత్రమే తినాలి. ఎక్కువగా తింటే కడుపు నొప్పి, గొంతు నొప్పి వంటి సమస్యలు రావచ్చు. నెయ్యి లేదా కొద్దిగా ఉప్పుతో తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుంది. మొత్తంగా, పచ్చి మామిడి వేసవిలో శరీరానికి సహజమైన శక్తిని అందించే ఒక అద్భుతమైన ఆహారం.

# ముంబై ఇండియన్స్‌కు బిగ్ షాక్.. కేకేఆర్‌తో మ్యాచ్‌కి స్టార్ ప్లేయర్స్ ఔట్!






**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభంలోనే ముంబై ఇండియన్స్ జట్టుకి బిగ్ షాక్ తగిలింది. రేపు (2026, మార్చి 29న) కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరగనున్న తొలి పోరుకి ముందు ముగ్గురు కీలక ఆటగాళ్లు అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. వాంఖెడేలో సీజన్‌ను ఘనంగా ప్రారంభించాలనుకుంటున్న ముంబైకి, ఈ కీలక ఆటగాళ్ల గైర్హాజరీ పెను సవాల్ గా మారింది. బౌలింగ్ అండ్ బ్యాటింగ్ విభాగాల్లో మార్పులు చేసి కేకేఆర్ జట్టును ముంబై ఇండియన్స్ టీమ్ ఎలా ఎదుర్కొంటుందో వేచి చూడాలి. మిచెల్ సాంట్నర్: న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్, ఇటీవలే దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్ ముగిసిన తర్వాత అతను ఇంకా జట్టుతో చేరాల్సి ఉంది. మిడిల్ ఓవర్లలో పరుగులు కంట్రోల్ ఇవ్వడంలో అతను కీలక పాత్ర పోషించనున్నాడు. కాగా టీ20 వరల్డ్ కప్‌లో 8 మ్యాచ్‌ల్లో 140 స్ట్రైక్ రేట్‌తో 120 పరుగులు చేయడమే కాకుండా, బంతితోనూ మెప్పించాడు. విల్ జాక్స్: వ్యక్తిగత కారణాల వల్ల ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ అందుబాటుపై లేదని తెలుస్తుంది. టీ20 వరల్డ్ కప్‌లో సెమీఫైనల్ వరకు వెళ్లిన ఇంగ్లాండ్ జట్టులో అతను కీలక పాత్ర పోషించాడు. ఇక టీ20 వరల్డ్ కప్ లో ఇంగ్లాండ్ తరపున అద్భుతంగా ఆడి, 9 వికెట్లు తీయడమే కాకుండా 4 సార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులను గెలుచుకున్నాడు. జస్ప్రీత్ బుమ్రా: వాంఖెడే స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు బుమ్రా కూడా హాజరుకాకపోవడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో అతడు రేపటి కేకేఆర్ తో జరిగే మ్యాచ్ ఆడేది అనుమానంగా మారింది.

**ప్రత్యామ్నాయ ప్లేయర్స్ ఎవరు?:**

అల్లా ఘజన్ఫర్: సాంట్నర్ స్థానంలో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఈ యువ స్పిన్నర్‌ను ఆడించే అవకాశం ఉంది. సాంట్నర్ లాగే ఇతను కూడా బంతితో బ్యాటర్లను నియంత్రణ చేస్తాడు.

షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ : విల్ జాక్స్ స్థానంలో పవర్ హిట్టింగ్ ఆల్‌రౌండర్ రూథర్‌ఫోర్డ్‌ను లోయర్ మిడిల్ ఆర్డర్‌లో ఉపయోగించుకోవచ్చు. ఇతను గతంలో గుజరాత్ టైటాన్స్ తరపున ఆడాడు.

# ఛేజింగ్ లో కోహ్లీ క్లాస్, పడిక్కల్ మాస్... తొలి మ్యాచ్‌లో ఓడిన సన్ రైజర్స్



ఐపీఎల్ 2026 సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరితమైన తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన 202 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 15.4 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించి, టోర్నీలో శుభారంభం చేసింది. విరాట్ కోహ్లీ అజేయ అర్ధశతకంతో పాటు దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్‌ల విధ్వంసకర బ్యాటింగ్ ముందు సన్‌రైజర్స్ బౌలర్లు తేలిపోయారు. భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆరంభంలోనే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (8) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. అయితే, ఆ తర్వాత విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్ సృష్టించిన విధ్వంసం మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు కేవలం 45 బంతుల్లోనే 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా పడిక్కల్ (26 బంతుల్లో 61; 7 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు వేగంతో పరుగులు సాధించి సన్‌రైజర్స్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. పడిక్కల్ ఔటయ్యాక వచ్చిన కెప్టెన్ రజత్ పటీదార్ (12 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) తన వంతు మెరుపులు మెరిపించి విజయాన్ని మరింత చేరువ చేశాడు. ఒకే ఓవర్లో పటీదార్, జితేష్ శర్మ (0) ఔటైనా, మరో ఎండ్‌లో విరాట్ కోహ్లీ (38 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) చివరి వరకు నిలిచి టిమ్ డేవిడ్ (16 నాటౌట్)తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో డేవిడ్ పేన్ రెండు వికెట్లు తీసినప్పటికీ, మిగతా వారెవరూ భారీ పరుగుల ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారు. ఈ విజయంతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. అంతకుముందు, టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టుకు ఆరంభంలోనే ట్రావిస్ హెడ్ (11), అభిషేక్ శర్మ (7) వికెట్లను త్వరగా కోల్పోవడంతో 29 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో కెప్టెన్ ఇషాన్ కిషన్ (38 బంతుల్లో 80; 8 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ (31)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఇషాన్ ఔటైన తర్వాత, చివర్లో యువ ఆటగాడు అనికేత్ వర్మ (18 బంతుల్లో 43; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో హైదరాబాద్ 200 పరుగుల మార్కును దాటగలిగింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసి కేవలం 22 పరుగులిచ్చి 3 వికెట్లతో సత్తా చాటాడు. రొమారియో షెపర్డ్ 54 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.

# మధ్య హోరాహోరీ పోరు.. టాస్ టైమింగ్, మ్యాచ్ ప్రిడిక్షన్ ఇదే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్ ఈరోజు ఘనంగా ప్రారంభం కాబోతుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. గత సీజన్‌లో తొలిసారి టైటిల్ గెలిచిన ఆర్సీబీ ఈసారి వరుసగా రెండో టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. మరోవైపు గత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయిన సన్‌రైజర్స్ ఈసారి బలంగా పునరాగమనం చేయాలని చూస్తోంది.

**ఆర్సీబీ బలాలు:**

రజత్ పాటిదార్ నాయకత్వంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు బరిలోకి దిగబోతుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు జట్టులోని కీలక ఆటగాళ్లు గాయాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. పేస్ బౌలర్లు జోష్ హేజిల్‌వుడ్, నువాన్ తుషార తొలి మ్యాచ్‌కు అందుబాటులో లేరు. అలాగే యశ్ దయాల్ మొత్తం సీజన్‌కు దూరమయ్యాడు. దీంతో బౌలింగ్ బాధ్యతలు భువనేశ్వర్ కుమార్, జాకబ్ డఫీ, మంగేష్ యాదవ్, రసిక్ సలామ్ మోయనున్నారు. బ్యాటింగ్ విభాగంలో విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, టిమ్ డేవిడ్ లాంటి ఆటగాళ్లు కీలకం కానున్నారు. వికెట్ కీపింగ్ బాధ్యతలను జితేష్ శర్మ నిర్వహించనున్నాడు. అలాగే రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా వంటి ఆల్‌రౌండర్లు చివరి ఓవర్లలో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం కలిగి ఉన్నారు.

**సన్‌రైజర్స్ బలాలు:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ విషయానికి వస్తే.. జట్టు ప్రధాన ఆటగాడు ప్యాట్ కమిన్స్ తొలి కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో ఇషాన్ కిషన్ తాత్కాలిక నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడు. బ్యాటింగ్‌లో

అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హైన్రిచ్ క్లాసెన్ వంటి ఆటగాళ్లు టాప్ ఆర్డర్‌ను బలంగా నిలబెడతారు. మిడిల్ లో నితీష్ కుమార్ రెడ్డి, లియామ్ లివింగ్‌స్టోన్ లాంటి ప్లేయర్స్ జట్టుకు అదనపు బలంగా మారనున్నారు. ఇక బౌలింగ్ విభాగంలో హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్, బ్రైడన్ కార్స్ ఉన్నప్పటికీ, ప్యాట్ కమిన్స్ లేకపోవడం జట్టు కొంత బలహీనంగా కనిపిస్తుంది.

**ఈ మ్యాచ్ సాయంత్రం 7: 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. టాస్ సాయంత్రం 7 గంటలకి పడనుంది.**

**ఈ మ్యాచ్ ఎక్కడ జరుగుతుంది?:**

ఆర్‌సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ మధ్య మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరుగుతుంది.

**ఎవరు గెలుస్తారు?:**

బెంగళూరులో ఎస్ఆర్‌హెచ్‌పై గెలవడానికి ఆర్‌సీబీ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. హోమ్ గ్రౌండ్ ప్రయోజనం, బలమైన బ్యాటింగ్ లైనప్, ప్రస్తుత ఛాంపియన్‌గా ఉన్న ఆత్మవిశ్వాసం కారణంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అయితే, SRH బ్యాటింగ్ లైనప్ గనుక క్లిక్ అయితే చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద పారడం ఖాయం.

# దిశా పటానీ అందాలకు సోషల్ మీడియాలో క్రేజ్.. ఫ్యాన్స్ ఫిదా

బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తెలుగులో 'లోఫర్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, రీసెంట్‌గా 'కల్కి 2898-ఏడీ'లో ప్రభాస్ సరసన మెరిసిన ఈ భామ, అటు సినిమాలతోనూ ఇటు హాట్ ఫోటోషూట్‌లతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా దిశా పోస్ట్ చేసిన మైండ్ బ్లాక్ అయ్యే పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఆమె అందచందాలకు నెటిజన్లు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం ..

**టాలీవుడ్ ఎంట్రీ నుండి పాన్ ఇండియా స్టార్ వరకు :**



వైష్ణవి చైతన్య టైమ్‌లెస్ ఎత్నిక్ లుక్‌లో గాంభీర్యాన్ని పునర్నిర్వచించింది

వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే తన క్యూట్ అండ్ హాట్ లుక్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'కల్కి 2898-ఏడీ'లో నటించి మరోసారి టాలీవుడ్ వెండితెరపై మెరిసింది. ఇక సూర్య కంగువ మూవీ లో నటించి మెప్పించింది. ఇక గ్లోబల్ లెవల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తోంది.

**సోషల్ మీడియాలో గ్లామర్ విందు:**

దిశా పటానీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎప్పటికప్పుడు తన ఫిట్‌నెస్ వీడియోలను, గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో మెరిసే డ్రెస్ వేసుకుని, తన ఎద అందాలతో కుర్రాళ్లకు మెంటలెక్కించేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా దిశా అందానికి దాసోహం అనాల్సిందే. నెట్టింట మంటలు పుట్టించడంలో ఈమె రూటే సెపరేట్ అని నెటిజన్లు



కామెంట్స్ చేస్తున్నారు.

**బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్.. స్పెషల్ షోలతో బిజీ:**

కేవలం సినిమాలే కాకుండా, దిశా పటానీ టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కోట్లు గడిస్తోంది. ఫిట్‌నెస్ ఫ్రీక్ కావడంతో స్పోర్ట్స్ వేర్ మరియు ఫ్యాషన్ బ్రాండ్ల ప్రకటనల్లో ఈమెకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే పలు స్పెషల్ షోలు, ఈవెంట్లలో తన డాన్స్ పర్ఫార్మెన్స్‌తో స్టేజ్‌పై నిప్పులు చెరుగుతుంది. ఇక బాలీవుడ్ టాప్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ షోతో తన పాపులారిటీ తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. మొత్తానికి దిశా పటానీ అటు వెండితెరపై, ఇటు సోషల్ మీడియాలోనూ తన హవా కొనసాగిస్తోంది. నటనతో పాటు తన పర్ఫెక్ట్ ఫిజిక్‌తో యూత్ ఐకాన్‌గా మారింది. ప్రస్తుతం చేతిలో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్న ఈ భామ, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఇక ఏదేమైనా దిశా పటానీ అప్‌డేట్ వచ్చిందంటే చాలు, నెటిజన్లు ఆ ఫోటోలపై ఒక లుక్కేయకుండా ఉండలేరు. ఈ బాలీవుడ్ భామ అందాలకు ఫిదా అవ్వని వారుండరంటే అతిశయోక్తి కాదు!



త్రిధా చౌదరి నీలి రంగులో చక్కదనాన్ని పునర్నిర్వచించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965